తెలుగు దినపత్రిక

# సిరి

People's Voice
వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

01-04-2026

బుధవారం హైదరాబాద్

సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 64

PUBLISHED FROM HYDERABAD   పేజీలు-8   వెల:రూ.4 /–

## ఓం నమశ్శివాయః ... కళ్యాణమహోత్సవ సందడి

- జోగిపేట వేలాదిగా హాజరైన భక్తులు, మహిళలు
- పాల్గొన్న మంత్రి దామోదర రాజనర్సింహకు స్వాగతం


5



**అందోలు, మార్చి 31, (సిరి న్యూస్):**
జోగిపేట పట్టణంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ జోగినాథ రథోత్సవాల్లో భాగంగా మంగళవారం శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక వీరహనుమాన్ దేవాలయం నుంచి శివపార్వతుల విగ్రహాలను ఎండ్లబండిపై డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా జోగినాథుడి అలయం వరకు తీసుకొచ్చారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో కళ్యాణోత్స వాన్ని ఆలయ పూజరులు వీరభద్రప్ప, సిద్దేశ్వర్ జరిపించారు.

## బెంగాలీలను బీజేపీ అవమానిస్తోంది

- నా ముఖం చూసి మాత్రమే వోటేయండి
- సెంటిమెంట్ మాటలతో మమత ప్రచారం



4

## ఎల్‌డీఎఫ్‌తో బీజేపీ కుమ్మక్కు

అందుకే శబరిమలపై మాట్లాడడం లేదు
మరోమారు విమర్శలు గుప్పించిన రాహుల్
కేరళంలో ఉధృత ప్రచారం

4



## గ్లోబల్ చిప్ సప్లైలో భారత్ ముందడుగు

- స్వయం సమృద్ధి దిశగా వేగంగా అడుగులు
- ప్రధాని నరేంద్రమోదీ కీలక వ్యాఖ్యలు
- సనంద్‌లో భారీ సెమీకండక్టర్ ప్లాంట్ ప్రారంభం



4




## తూతూ మంత్రంగా అసెంబ్లీ సమావేశాలు

ఆరు గ్యారంటీలపై స్పష్టత ఏదీ?
కేరళ ఎన్నికల కోసం అర్థాంతరంగా ముగింపు
ప్రజా సమస్యలపై చర్చించకుండా పారిపోయారు
పొంగులేటి అవినీతిని బయటపెట్టాం
డైవర్షన్ పాలిటిక్స్ లో భాగమే మా ఎమ్మెల్యేల సస్పెన్షన్
కాళేశ్వరంపై కేంద్ర మంత్రి పాటిల్ వ్యాఖ్యలు అభ్యంతరకరం
మల్లన్న సాగర్‌లో ఇప్పటికీ 25 టీఎంసీల నీళ్లు
బీఆర్ఎస్ నేత హరీష్‌రావు

2

# గ్రామ సభలకు సన్నద్ధం



- అమలులో ఉన్న, కొత్త పథకాలను వివరించాలి

**హైదరాబాద్, మార్చి 31, సిరి న్యూస్‌టుడే:**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 2 నుంచి ప్రభుత్వం చేపడుతున్న గ్రామ సభలను పెద్ద ఎత్తున నిర్వహించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు. ప్రజాభవన్ నుంచి మంగళవారం సాయంత్రం ఆయన జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామ సభలను రాష్ట్రవ్యాప్తంగా ఒకే తరహాలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. మొదట ముఖ్యమంత్రి సందేశం వినిపించి తర్వాత ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను చదివి వినిపించాలని సూచించారు. రైతు భరోసా లబ్దిదారుల పేర్లు, 200 యూనిట్ల విచిత విద్యుత్తు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను సాధ్యమైనంతవరకు గ్రామ సభలో చదివి వినిపించాలని ఆదేశించారు. ఇప్పటివరకు ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, జూన్ 2 నుంచి అందరికీ జీవిత బీమా అమలు చేయబోతున్న విషయాన్ని వివరించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉదయంపూట

మిగతా 2వ పేజీలో..

## ప్రజాస్వామ్య పద్ధతిలో మూసీ పునరుజ్జీవం

- 15 రోజులపాటు ప్రజల అభిప్రాయాలు తెలుసుకుంటాం
- విలువైన సూచనలు చేసిన వారితో సబ్ కమిటీ భేటీ
- మూసీ సబ్ కమిటీ సభ్యులు 24/7 అందుబాటులో

2

## ఉచిత బస్సుతో మహిళలకు మేలు

- పదివేల కోట్లు ఆదాచేసిన మహిళలు
- ఆర్టీసీ అభివృద్ధికి అనేక చర్యలు

**హైదరాబాద్, మార్చి31, సిరి న్యూస్‌టుడే:**
తెలంగాణ ప్రజా భవన్ వేదికగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ ప్రగతిపై కీలక ప్రకటన చేశారు. ప్రజా పాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన

మిగతా 3వ పేజీలో..




## గ్రామ సభలు ప్రజల స్వరం ప్రతిబింబించే వేదికలు

2నుంచి వాటి నిర్వహణకు ఏర్పాట్లు చేయండి
జిల్లాల అధికారులకు దిశా నిర్దేశం చేసిన మంత్రి సీతక్క

2





2

## ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు

- 4న విచారణకు హాజరు కావాలని ఆదేశాలు

## శ్రీశైలంలో అక్రమంగా విద్యుదుత్పత్తి


నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఏపీ ప్రభుత్వం
మండిపడ్డ మంత్రి జూపల్లి కృష్ణారావు

2



## చిన్నారిపై అసభ్య దృశ్యాల చిత్రీకరణ

- వరుసకు సోదరుడి అకృత్యం–
- నిందితుడి అరెస్ట్– టీజీసీఎస్‌బీ



3



## కేరళంలో యూడిఎఫ్ సెంచరీ ఖాయం

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

4

## తెలంగాణలో ఒక్కసారిగా మారిన వాతావరణం

పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉందని సూచన

**హైదరాబాద్,మార్చి31, సిరి న్యూస్‌టుడే:**
తెలంగాణ వ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. అల్పపీడన ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో అకాల వర్షాలు కురుస్తున్నాయి.


మిగతా 3వ పేజీలో..

## భోజనం పెట్టమన్నందుకు మోకాళ్లపై నిలబెట్టారు !

- బీసీ హాస్టల్ విద్యార్థినుల పట్ల ప్రిన్సిపాల్ దాష్టికం !
- ఉన్నది తినాలి చెప్పింది వినాలి లేదంటే మోకాళ్లపైనే నిల్చోవాలి !
- చిన్నారులను గంటపాటు చీకట్లో శిక్ష !
- కడుపు నిండ లేదన్న వాళ్ళు ఇక రోజు ఇలా పస్తులతోనే నిల్చోవాలంటూ వార్నింగ్ !!
- గురుకుల పాఠశాలలో విద్యార్థినుల పట్ల అమానుషం !
- నల్గొండ జిల్లా దామరచెరువు గురుకుల వసతి

5



## హర్మూజ్‌పై ఇరాన్ పట్టు బిగింపు

ఇటు వెళ్లే నౌకలకు గరిష్ఠంగా రూ.18.90 కోట్ల టోల్

4



# గ్రామ సభలకు సన్నద్ధం

**మొదటిపేజీ తరువాయి**

అల్పాహారం, మూడు రోజులపాటు గ్లాస్ పాలు, మూడు రోజులపాటు రాగి జావ అందిస్తున్న విషయాన్ని వివరించాలన్నారు. ఇంటర్ కళాశాలల విద్యార్థులకు కొత్తగా మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్న విషయం అందరికీ తెలిసేలా వివరించాలన్నారు. వీటిని వివరించే క్రమంలో సాంస్కృతిక శాఖ, పౌర సంబంధాల శాఖ సహాయసహకారాలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీలకు పెద్ద ఎత్తున నిధులు విడుదల చేస్తున్నాం.. గ్రామాల వారీగా విడుదలైన నిధుల వివరాలను అందుబాటులో పెట్టుకుని గ్రామ సభ రోజు ఆ గ్రామానికి ఎంత చేరిందో ప్రకటించాలన్నారు. ప్రజా పాలన విజయవంతం అవుతున్న తీరును ఎప్పటికప్పుడు చీఫ్ సెక్రటరీ, ప్రణాళికా శాఖ ఉన్నతాధికారులు జిల్లా కలెక్టర్ల నుంచి సమాచారం సేకరిస్తారని తెలిపారు. ప్రభుత్వం కేవలం సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకే పరిమితం కాదు.. మౌలిక సదుపాయాల అభివృద్ధి, సేవా రంగాన్ని అభివృద్ధి చేస్తూ ముందుకు పోతున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు

# ప్రజాస్వామ్య పద్ధతిలో మూసీ పునరుజ్జీవం

- **15 రోజులపాటు ప్రజల అభిప్రాయాలు తెలుసుకుంటాం**
- **విలువైన సూచనలు చేసిన వారితో సబ్ కమిటీ భేటీ**
- **మూసీ సబ్ కమిటీ సభ్యులు 24/7 అందుబాటులో**
- **డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

**హైదరాబాద్, మార్చి 31, సిరి న్యూస్‌టుడే:**

మూసీ పునరుజ్జీవ పనులు ప్రజాస్వామ్య పద్ధతిలో కొనసాగుతాయని డిప్యూటీ సీఎం, మూసీ కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్క మల్లు అన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో సహచర మంత్రి, మూసీ కేబినెట్ సబ్ కమిటీ సభ్యుడు పొన్నం ప్రభాకర్‌తో కలిసి మూసీ పునరుజ్జీవ పనుల ప్రగతిపై అధికారులతో సోమవారం చర్చించారు. నేటినుంచి ఏప్రిల్ 15 వరకు ఆన్‌లైన్‌లో musrirdc@gmail.com మెయిల్ ఐడి ద్వారా మూసీ పునరుజ్జీవంపై ప్రజల అభిప్రాయాలు స్వీకరిస్తామని తెలిపారు. వీటిలోని విలువైన సలహాలు, సూచనలను అధికారులతో విశ్లేషించి అభిప్రాయాలు వెల్లడించిన వారితో దశలవారీగా సబ్ కమిటీ సభ్యులు నేరుగా సంప్రదింపులు జరుపుతారని డిప్యూటీ సీఎం తెలిపారు. మూసీ ఒడ్డున ఓంకారేశ్వర ఆలయం పనులకు 28న శంకుస్థాపన జరిగిందని, ఆ రోజు నుంచి మూసీ ఫేజ్ 1, ఫేజ్ 2 వరకు చేయాల్సిన పనులకు సంబంధించిన రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. డిఫెన్స్ భూములు, మూసీ పునరావాసితులతో సంప్రదింపులు, నిర్మాణ డిజైన్లు తుది దశకు తీసుకురావడం, బ్యాంకర్స్‌తో మాట్లాడటం ఇలా పనులను విభజించుకుని ముందుకు వెళ్లాలని అధికారులకు డిప్యూటీ సీఎం దిశా నిర్దేశం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి యావత్ కేబినెట్ సంకల్పాన్ని అర్థం చేసుకొని అధికారులు ఉత్సాహంగా ముందుకు వెళ్లాలని, మీ జీవితాల్లో ఈ ప్రాజెక్టు ఒక మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. అధికారులకు ఎలాంటి సలహా, సూచన ఇతర ఏ అవసరాలు ఉన్నా మూసీ సబ్ కమిటీ సభ్యులు 24 గంటలపాటు అందుబాటులో ఉంటారని తెలిపారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ రంజన్, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ఇ.వి. నరసింహారెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, అధికారులు వినయ్ కృష్ణారెడ్డి, అశోక్ రెడ్డి, కలెక్టర్లు హరిచందన, నారాయణరెడ్డి, మను చౌదరి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తదితరులు



## ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి
# సీఐడీ నోటీసులు

- **4న విచారణకు హాజరు కావాలని ఆదేశాలు**

**హైదరాబాద్, మార్చి 31, సిరి న్యూస్‌టుడే:**

బీఆర్ ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు జారీ చేసింది. జనవరి 29న సమ్మక్క సారక్క జాతర దగ్గర జరిగిన గొడవలో కరీంనగర్ కమిషనర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును సీఐడీకి అప్పగించడంతో ఏప్రిల్ 4న హైదరాబాద్ సీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని అధికారులు నోటీసులు జారీ చేశారు. హుజురాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నం.30/2026 నమోదైంది. సమ్మక్క సారక్క జాతర సమయంలో రోడ్డుపై బైఠాయించి ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించారని, ప్రజలకు అసౌకర్యం కలిగించారని, పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని, పోలీస్ అధికారులపై అవమానకర వ్యాఖ్యలు చేశారని కౌశిక్ రెడ్డిపై ఆరోపణలున్నాయి. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ప్రవర్తించినట్టు కేసు నమోదైంది. ఘటన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఏప్రిల్ 4న ఉదయం 11:30 గంటలకు విచారణకు హాజరు కావాలని స్పష్టం చేశారు. గుర్తింపు పత్రాలు, సంబంధిత డాక్యుమెంట్లు తీసుకురావాలని.. విచారణకు సహకరించాలని కోరారు. సాక్ష్యాలను చెడగొట్టవద్దని హెచ్చరించారు. నోటీసును పట్టించుకోకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# తూతూ మంత్రంగా అసెంబ్లీ సమావేశాలు

- **ఆరు గ్యారంటీలపై స్పష్టత ఏదీ?**
- **కేరళ ఎన్నికల కోసం అర్ధాంతరంగా ముగింపు**
- **ప్రజా సమస్యలపై చర్చించకుండా పారిపోయారు**
- **పొంగులేటి అవినీతిని బయటపెట్టాం**
- **డైవర్షన్ పాలిటిక్స్ లో భాగమే మా ఎమ్మెల్యేల సస్పెన్షన్**
- **కాళేశ్వరంపై కేంద్ర మంత్రి పాటిల్ వ్యాఖ్యలు అభ్యంతరకరం**
- **మల్లన్న సాగర్‌లో ఇప్పటికీ 25 టీఎంసీల నీళ్లు**
- **బీఆర్ఎస్ నేత హరీష్‌రావు**

**హైదరాబాద్, మార్చి 31, సిరి న్యూస్‌టుడే:**

శాసనసభ సమావేశాలు ఒక దిశా నిర్దేశం లేకుండా ముగిశాయని బీఆర్ఎస్ నేత హరీష్‌రావు అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలపై స్పష్టత వస్తుందని, ప్రజా సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఆశించిన ప్రజలకు ప్రభుత్వం తీవ్ర నిరాశనే మిగిలించిందన్నారు. బడ్జెట్, బిల్లులు పాస్ చేసుకోవడానికి, రాజ్యాంగ అనివార్యతను పూర్తి చేయడానికి మాత్రమే తూతూ మంత్రంగా సభను నడిపారని ఆరోపించారు. ప్రజా సమస్యలు చర్చించడానికి ప్రభుత్వం ముందుకు రాలేదు. 19 సమస్యలపై షార్ట్ డిస్కషన్ కోసం బీఆర్ఎస్ నోటీసులు ఇచ్చినా ఏ ఒక్క అంశంపైనా ప్రభుత్వం చర్చకు రాలేదు. చేసిన మంచి పనులు చెప్పుకోవడానికి ఒక్క ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రాం కూడా లేని దయనీయ స్థితిలో కాంగ్రెస్ ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రతిపక్షాలు అడిగిన ప్రజా సమస్యల మీద సూటిగా సమాధానం చెప్పకుండా తొండల భాష, కండల భాష వాడారు. ప్రభుత్వం డిఫెన్స్‌లో పడ్డప్పుడల్లా ప్రతిపక్షాలపై ఎదురుదాడికి దిగడం, గత ప్రభుత్వంపై విమర్శలు చేయడం తప్ప మరేమీ లేదు. ప్రజల పక్షాన ప్రశ్నించడానికి ప్రతిపక్షం ఉంటుంది. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం ప్రశ్నించడమే ప్రతిపక్ష బాధ్యత. ఆ బాధ్యతను బీఆర్ఎస్ నిర్వహిస్తుంటే కాంగ్రెస్ తట్టుకోలేకపోతోంది. ప్రశ్నోత్తరాల సమయాన్ని కూడా ఎత్తివేసింది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం రోజు, ఆర్థిక మంత్రి బడ్జెట్ పెట్టిన రోజు ప్రశ్నోత్తరాలు లేవు. ప్రతిపక్షాల ప్రశ్నలు చర్చకు రాకుండా చేశారు. ఏ ఒక్కరోజు కూడా అసెంబ్లీని సమయానికి ప్రారంభించలేదు. సమయపాలన లేదు, సభ అంటే గౌరవం లేదు. అసెంబ్లీలో టీ బ్రేక్ 10 నిమిషాలు, లంచ్ బ్రేక్ అరగంట ఉంటుంది. కానీ, ముఖ్యమంత్రి ఢిల్లీ నుంచి వస్తున్నాడని ఏకంగా 4 గంటలు టీ బ్రేక్ ఇచ్చారు. ఫైనాన్స్ మినిస్టర్ ప్రిపేర్ అవుతున్నాడని 3 గంటలపాటు సభను ఆపారు. ప్రిపరేషన్ ఇంట్లో చేసుకోవాలి కానీ సభకు వచ్చాక చేస్తారా.. కావాలనే లేట్ నైట్ వరకు సభ నడిపి సభ్యులు లేకుండా చేయాలని చూశారు. వారం రోజులు సభను ఎక్స్‌టెండ్ చేయమని అడిగినా ప్రభుత్వం ముందుకు రాలేదు. కేరళ ఎన్నికల ప్రచారం కోసం అసెంబ్లీని 30నే హడావుడిగా ముగించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు, ప్రజా సమస్యలు ముఖ్యమా? లేక కేరళ ప్రచారం ముఖ్యమా అని ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అవినీతిని సాక్ష్యాధారాలతో సభలో బయటపెడితే ప్రజల దృష్టి మరల్చడానికి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడ్డారు. రవీంద్రభారతిలో నాటకాలు వేశారు. అవినీతి నుంచి మంత్రిని కాపాడటానికే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను రెండు రోజులపాటు సస్పెండ్ చేసి ముఖ్యమైన బిల్లులను ఆమోదింపజేసుకున్నారు. హేట్ స్పీచ్ బిల్లును చివరి రోజు తెచ్చి చర్చ లేకుండానే ముగించారు. పద్దులన్నీ చివరి రోజు గిలెటిన్ చేసుకొని పారిపోయారు. ఇరిగేషన్ పద్దు మీద కూడా కనీస చర్చ లేకుండా పాస్ చేసుకున్నారు. హౌస్ కమిటీ పని కిరాదని చెప్పి శాసనసభ్యులకు, సభకు గౌరవాన్ని తగ్గించారన్నారు.

**మిమ్మల్ని వ్యక్తిగతంగా కాదు.. ప్రభుత్వాన్ని విమర్శించాం**

ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఇద్దరూ మా బడ్జెట్ చింపుతారా అని మాట్లాడుతున్నారు. మీ బడ్జెట్‌లో ఏమీ లేదు.. అది పూర్తిగా డొల్ల బడ్జెట్. కాబట్టే చింపి నిరసన వ్యక్తం చేశాము. ఈ విమర్శ ఆర్థిక మంత్రి భట్టిని వ్యక్తిగతంగా అన్నది కాదు.. ఆ హోదాలో ఉన్న ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నాం. మీరు ప్రవేశపెట్టింది మూడో బడ్జెట్, మిగిలింది ఇంకొక్కటే బడ్జెట్. కోటి మంది మహిళలకు నెలకు రూ. 2500 ఇస్తానని చెప్పి మూడు బడ్జెట్లలో ఎందుకు నిధులు పెట్టలేదు. అవ్వాతాతలను, రైతన్నలను, నిరుద్యోగులను, విద్యార్థులను, మహిళలను.. ఇలా అన్ని వర్గాలను మోసం చేశారు. గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని ప్రజల చెవిలో పూలు పెట్టింది మీరే. మీ మోసాలను అర్థం చేయించడానికే సభలో వినూత్నంగా చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన తెలిపాము. కృష్ణా, గోదావరి జలాలపై అసెంబ్లీలో చర్చిద్దామని అడిగితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎందుకు పారిపోయారు? కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చింది కేవలం 16 వేల ఉద్యోగాలే అని వారే శాసనసభకు ఇచ్చిన సమాధానంతో స్పష్టమైంది. నిరుద్యోగుల ఆకాంక్షను సభలో గట్టిగా వినిపించాం. రెండున్నర సంవత్సరాల్లో బీసీ కార్పొరేషన్‌కు ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదని రుజువు చేశాం. బీసీల గొంతుకగా బీఆర్ఎస్ పోరాడింది. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులపై కూడా స్పష్టంగా బహిర్గతం చేశాం. దళితులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వని ఈ ప్రభుత్వ వైనాన్ని ఎండగట్టాం. దళితులపై రేవంత్ రెడ్డిది కపట ప్రేమ మాత్రమే. కాంగ్రెస్ సభ్యులు సభలో కత్తుల కోలాటం ఆడతాం, తలలు తీస్తాం, సామాజిక బహిష్కరణ చేస్తాం అని ప హిల్వాన్ల భాష మాట్లాడుతుంటే ముఖ్యమంత్రి ప్రోత్సహించారు. ఈ వ్యాఖ్యలను ఎందుకు ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేయరు? రేవంత్ రెడ్డి రెండేళ్లుగా సభలో మాట్లాడుతున్న భాష కూడా ఎథిక్స్ కమిటీకి వెళ్లాల్సిందేనన్నారు. పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ కాళేశ్వరంపై చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. ఆయన వ్యాఖ్యలు రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న భాషలాగే ఉన్నాయి. బీఆర్ఎస్‌పై బురదజల్లేందుకు కాంగ్రెస్, బీజేపీల ఫెవికాల్ బంధం బయటపడింది. నిన్న బడ్జెట్‌లో సాక్షాత్తూ ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డే కాళేశ్వరంలో పారుతున్న లక్షల ఎకరాలకు అదనంగా 2024 లో 3000 ఎకరాలు కొత్తగా పారకం పెరిగింది. 2025లో కొత్త ఆయకట్టు సాగులోకి తెచ్చామని స్పష్టంగా చెప్పారు. ప్రాజెక్టు లక్ష కోట్లు కొట్టుకుపోతే ఈ కొత్త ఆయకట్టుకు పారకం ఎక్కడినుంచి వచ్చింది? భువనగిరి జిల్లాలో ఆలేరు, భువనగిరి ఎమ్మెల్యేలు కాలువల



కు వెళ్లి నీళ్లు వదులుతున్నారు కదా.. అవి కాళేశ్వరం నీళ్లు కావా? గంధమల్ల ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు, అది కాళేశ్వరంలో భాగం కాదా? హైదరాబాద్‌కు తాగునీటి కోసం మూసీ పక్కనుంచి 20 టీఎంసీల నీళ్లు తెస్తామని రూ.8,000 కోట్లతో కాలువలు తవ్వుతున్నారు కదా.. కాళేశ్వరం కొట్టుకుపోతే మల్లన్న సాగర్ నుంచి ఆ నీళ్లు ఎలా వస్తున్నాయి? ఈ నిమిషానికి కూడా మల్లన్న సాగర్‌లో 25 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్, అలాగే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్, కాంగ్రెస్ నాయకులకు సవాల్ విసురుతున్నాను. మీరు తెలంగాణకు రండి. యాదాద్రి భువనగిరి, చొప్పదండి, జగిత్యాల, సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, మెదక్, నర్సాపూర్ రైతుల్ని ఆ గోదావరి నీళ్లు ఎక్కడివో అడుగుదాం. కాళేశ్వరం నీళ్ల వల్ల పండిన పచ్చని పొలాలను చూద్దాం, రైతులను పలకరిద్దాం రండి. సిద్దిపేటలో ఈ నిమిషానికి 80,000 ఎకరాల పంట పండింది.. అవన్నీ కాళేశ్వరం నీళ్లతో పండిన పంటలే కదా. నేను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి 20 ఉత్తరాలు రాశాను. ప్రభుత్వం కేవలం రూ.50 కోట్లు విడుదల చేస్తే కొత్తగా ఏడాదికి రెండు లక్షల ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుంది. కానీ ఆ నిధులు ఇవ్వకుండా పగ పట్టారు. అలా నీళ్లు ఇస్తే కాళేశ్వరం పోయింది అని తాము చెప్పిన అబద్ధం ఎక్కడ బయటపడుతుందో అన్న అక్కసుతో రైతులకు శిక్ష వేస్తున్నారు. తక్షణమే ఆ నిధులు విడుదల చేసి కాలువలకు నీళ్లు వదలాలి. చిరుద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, బీసీ, ఎస్సీ, ఎస్టీలు సహా అన్ని వర్గాల పక్షాన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని నిలదీసింది. శాసనసభ మాత్రమే కాదు.. ప్రజాక్షేత్రంలో అన్ని వేదికలపైనా ప్రభుత్వ తప్పిదాలను ఎండగడతాం. కేసీఆర్ ఆదేశాల మేరకు, ఈ ప్రజా వ్యతిరేక ప్రభుత్వంపై బీఆర్ఎస్ పోరాటం నిరంతరం కొనసాగు

# గ్రామ సభలు ప్రజల స్వరం ప్రతిబింబించే వేదికలు

- **2నుంచి వాటి నిర్వహణకు ఏర్పాట్లు చేయండి**
- **జిల్లాల అధికారులకు దిశా నిర్దేశం చేసిన మంత్రి సీతక్క**

**హైదరాబాద్, మార్చి 31, సిరి న్యూస్‌టుడే:**

ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేయాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. జిల్లాల పంచాయతీ అధికారులతో మంగళవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం జరుపుతున్న 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం గ్రామ సభలు నిర్వహించనున్న నేపథ్యంలో వాటి నిర్వహణపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామ సభలు ప్రజల అభిప్రాయాలను నేరుగా తెలుసుకునే అత్యంత ముఖ్యమైన వేదికలని పేర్కొన్నారు. పాలనలో వారి భాగస్వామ్యాన్ని పెంపొందించడం, గ్రామస్థాయి సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారాలు కనుగొనడం, ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామ సభల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాలు, రైతులు, యువత, స్వయం సహాయక సంఘాల సభ్యులు, లబ్ధిదారులు తప్పనిసరిగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో విస్తృత ప్రచారం చేపట్టి గ్రామస్థులందరూ హాజరయ్యేలా చూడాలన్నారు. సభల అజెండాను స్పష్టంగా ప్రజలకు తెలియజేసి రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి, గృహ జ్యోతి, పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, మహిళా శక్తి వంటి పథకాలపై విస్తృతంగా జరగాలన్నారు. ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించిన నూతన పథకాల కోసం అర్హులను గుర్తించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి గ్రామ సభలో విధిగా ఫిర్యాదు బాక్సులను ఏర్పాటు చేసి ప్రజల అభ్యంతరాలు, ఫిర్యాదులను స్వీకరించాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. గ్రామ సమస్యలను సమగ్రంగా గుర్తించి వాటి పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. అనంతరం సమావేశ వివరాలను నమోదు చేసి సమస్యలు, తీర్మానాలు, తీసుకున్న నిర్ణయాలపై నివేదికలను సమర్పించాలని స్పష్టం చేశారు. ప్రతి గ్రామానికి అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేయడంలో గ్రామ సభలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. గ్రామ సభలను పండగలా నిర్వహించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ



డైరెక్టర్ దివ్యదేవరాజన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల**

గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయి. 202526 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి టైడ్ గ్రాంట్స్ రూ.371.91 కోట్లు, యునైటెడ్ గ్రాంట్స్ రూ.247.94 కోట్లు కేంద్రం విడుదల చేసింది. కాగా, కేంద్రం నుంచి మరో రూ.వెయ్యి కోట్ల

## ఉచిత ప్రయాణాలతో
# రూ.10 వేల కోట్ల ఆదా

- **290 కోట్ల ప్రయాణాలు చేసిన మహిళలు**
- **మహిళలకు అభినందనలు తెలిపిన మంత్రి సీతక్క**

**హైదరాబాద్, మార్చి 31, సిరి న్యూస్‌టుడే:**

సోనియా, రాహుల్ గాంధీ మల్లికార్జున్ ఖర్గేల ఆలోచనలకనుగుణంగా ఆడబిడ్డలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. ఆర్టీసీలో మహాలక్ష్మి పథకం కింద 290 కోట్ల ఉచిత ప్రయాణాల ద్వారా రూ.10 వేల కోట్ల ప్రయాణ చార్జీల ఆదాపై అభినందన కార్యక్రమం సోమవారం జరిగింది.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళలకు బస్సు చార్జీలు లేకుండా ప్రయాణించే విధంగా ఆర్టీసీకి రూ.10 వేల కోట్ల నిధులు చెల్లించిన ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు ధన్యవాదాలు తెలిపారు. నయాపైసా ఆర్థిక భారం లేకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా ప్రయాణం చేసే విధంగా తమ ప్రభుత్వం మహిళలకు వెసులుబాటు కల్పించిందని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణాన్ని ఎగతాళి చేసేలా కొందరు నేతలు చిల్లర మాటలు మాట్లాడుతున్నారని, మహిళలను కించపరిచే వారిని ప్రతి మహిళా ఎదిరించాలని పిలుపునిచ్చారు. ఈ పథకాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మహిళలదేనన్నారు. మహిళలకు డబ్బులు ఆదా కావాలి.. ఆత్మ గౌరవంతో బతకాలి.. ఆ విధంగా మహిళలకు ఆత్మగౌరవాన్ని కల్పించింది ఉచిత బస్సు ప్రయాణం అని పేర్కొన్నారు. ఉపాధి పనులు, చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకునే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం వరంగా మారిందన్నారు. ఆడబిడ్డల అభ్యున్నతి కోసం ప్రభుత్వం పని చేస్తోందంటూ బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాలు కల్పించడంతో రూ.8 వేల కోట్ల పెట్టుబడులతో 4.7 లక్షల సూక్ష్మ పరిశ్రమలు మహిళలు ఏర్పాటు చేశారని తెలిపారు. మహిళా సంఘాల రుణాలకు రూ.1390 కోట్ల వడ్డీలను చెల్లించామని, కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేసేందుకు సంకల్పించామని ఆమె వెల్లడించారు. మహిళ సంతోషంగా ఉంటే రాష్ట్రం సంతోషంగా ఉంటుందన్నారు. తమది బీఆరఎస్ మాదిరి మాయమాటలు చెప్పి మోసం చేసే ప్రభుత్వం కాదన్నారు. ఉచిత బస్సు ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకున్న మహిళలందరికీ అభినందనలు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలన్నింటినీ సద్వినియోగం చేసుకొని మహిళలు రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, మహిళా ఐఏఎస్ ఆఫీస



## శ్రీశైలంలో అక్రమంగా
# విద్యుదుత్పత్తి

- **నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఏపీ ప్రభుత్వం**
- **మండిపడ్డ మంత్రి జూపల్లి కృష్ణారావు**

**హైదరాబాద్, మార్చి 31, సిరి న్యూస్‌టుడే:**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీశైలం నుంచి అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తోందంటూ మంత్రి జూపల్లి కృష్ణారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. దీంతో వేసవిలో నీటికి కటకట ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. శ్రీశైలం ప్రాజెక్టులో విద్యుదుత్పత్తి చేయొద్దని నిబంధన ఉందని, ట్రయల్స్ చేయొద్దని జీవో కూడా ఉందని, తాగునీటి కోసం మాత్రమే వినియోగించాలని సమైక్య రాష్ట్రంలో ఇచ్చిన జీవో స్పష్టంగా ఉందని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ హైకోర్టులో గతంలో పిల్ కూడా వేశామని, జస్టిస్ పినాకి ఘోష్ ఇచ్చిన తీర్పు కూడా ఉందని అన్నారు. కరెంటు ఉత్పత్తి చెయ్యడానికి వీలు లేదన్నారు. దొంగతనంగా కరెంటు తీసుకోవాల్సిన ఖర్మ ఏపీకి ఎందుకని నిలదీశారు. ధర్నా చేస్తామని చెప్పడంతో పంపింగ్ ఉపసంహరించుకుందన్నారు. పాలమూరు రైతాంగం, ప్రజలకు అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందని స్పష్టం చేశారు. నీటి కేటాయింపు అంశం కోర్టులో పెండింగ్ లో ఉందని, 69 శాతం తెలంగాణకు ,31 శాతం ఆంధ్రకు వాటా రావాల్సి ఉందని తెలిపారు. ప్రభుత్వం మన రాష్ట్ర హక్కును కాపాడుతుందని, అక్రమంగా నీటిని తరలిస్తే ప్రజల పక్షాన కాంగ్రెస్ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. మంత్రి జూపల్లి వ్యాఖ్యలతో ఏపీ, తెలంగాణ మధ్య నీటి వివాదం మరోసారి తెరపైకి వచ్చింది.



## తెలంగాణలో ఒక్కసారిగా
# మారిన వాతావరణం

**మొదటిపేజీ తరువాయి**

గత రెండు రోజులుగా ఎండలు, వర్షాలతో కూడిన భిన్నమైన వాతావరణం ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. హైదరాబాద్ లో వర్షం అవకాశం ఉంది. ఇబ్రహీంపట్నం, బి.ఎన్.రెడ్డి నగర్, మీర్‌పేట్, బాలాపూర్, చంద్రాయణగుట్ట, ఎల్బీనగర్, సరూర్ నగర్, వనస్థలిపురం, హయత్ నగర్, ఉప్పల్,నాగోల్ ఏరియాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

మార్చి 31న ఉదయం నుంచే కొమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజాంబాద్, కరీంనగర్, జగిత్యాల, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ఆకాశం మేఘావృతమై ఉండటంతో పగటిపూట కూడా చీకట్లు అలుముకున్నాయి. రాబోయే 4 రోజుల పాటు రాష్ట్రంలో ఇదే పరిస్థితి కొనసాగనుంది. గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, కొన్ని చోట్ల వడగళ్ల వాన పడే ప్రమాదం ఉందని అధికారులు తెలిపారు. ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు ఉండకపోయినా గాలిలో తేమ పెరగనుంది. అయితే ఈ అకాల వర్షాలు అన్నదాతలకు కన్నీరు మిగిలిస్తున్నాయి. కోతకు సిద్ధంగా ఉన్న మామిడి పంట ఈదురు గాలుల వల్ల నేలపాలయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికే పలు చోట్ల మామిడి తోటలు దెబ్బతినడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.




## ఉచిత బస్సుతో
# మహిళలకు మేలు

**మొదటిపేజీ తరవాయి**

48 గంటల్లోనే ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని ఆయన గుర్తుచేశారు. డిసెంబర్ 9, 2023న ప్రారంభమైన మహాలక్ష్మి పథకం అద్భుత ఫలితాలను ఇస్తోందని మంత్రి వెల్లడించారు. ఇప్పటివరకు 290 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించి.. దాదాపు 10 వేల కోట్ల రూపాయలను ఆదా చేసుకున్నారని తెలిపారు. మహిళా ప్రయాణికులను కేవలం ప్రయాణికులుగా మాత్రమే కాకుండా, వారిని ఆర్టీసీకి యజమానులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.ప్రతిరోజూ 65 లక్షల మంది ప్రయాణికుల్లో 40 లక్షల మంది మహిళలే ఉంటున్నారని.. 97 డిపోల పరిధిలో రోజూ 35 లక్షల కిలోమీటర్లు బస్సులు తిరుగుతున్నాయని మంత్రి పొన్నం తెలిపారు. ఈ భారీ లక్ష్యాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్న డ్రైవర్లు, కండక్టర్లకు ఆయన ప్రభుత్వం తరపున ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా రాఖీ వంటి పండుగ దినాల్లోనూ కుటుంబాలకు దూరంగా ఉండి సేవలందించిన కార్మికుల కృషి వెలకట్టలేనిదని కొనియాడారు. ఎలక్ట్రిక్ బస్సుల విషయంలో కొందరు కావాలని తప్పుదోవ పట్టిస్తున్నారని, యూనియన్ల పేరుతో రెచ్చగొట్టే చర్యలను మానుకోవాలని హెచ్చరించారు. తెలంగాణకు ఆర్టీసీయే లైఫ్ లైన్ అని ప్రజల రవాణా అవసరాలను తీర్చడంలో ఆర్టీసీ అగ్రస్థానంలో ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీని రాష్ట్రంలోని ప్రతి మూలకు చేర్చేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామన్నారు. నియోజకవర్గాల వారీగా కొత్త రూట్లు, కొత్త బస్సులు , బస్ స్టేషన్ల అభివృద్ధిపై ప్రజాప్రతినిధుల నుంచి నివేదికలు తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే హైదరాబాద్‌లో 340 కొత్త రూట్లలో బస్సులను ప్రారంభించామని త్వరలో రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని సర్వీసులు అందుబాటులోకి వస్తాయని స్పష్టం చేశారు. కార్మికుల సంక్షేమంపై స్పందిస్తూ.. బకాయిలను తీరుస్తున్నామని, యూనియన్ల ఏర్పాటు, ఆర్టీసీ విలీనం అంశాలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని మంత్రి పొన్నం వెల్లడించారు.

## పారాక్వాట్' నిషేధంపై అసెంబ్లీ తీర్మానం..

- **రైతు కమిషన్ హర్షం**

**హైదరాబాద్, మార్చి 31**

అత్యంత విషపూరితమైన పారాక్వాట్ (Paraquat) గడ్డి మందును నిషేధిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడం హర్షించదగ్గ విషయమని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి పేర్కొన్నారు. ఈ ప్రమాదకరమైన రసాయనం వల్ల వందలాది మంది తెలంగాణ రైతులు ప్రాణాలు కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గడ్డి మందులు, కలుపు నివారణ మందులను నిషేధించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (IMA), రైతు సంఘాల నేతలు గతంలోనే రైతు కమిషన్ దృష్టికి తీసుకువచ్చినట్లు ఆయన తెలిపారు.

రాష్ట్రంలో పారాక్వాట్‌ను నిషేధించడంతో పాటు, దేశవ్యాప్తంగా దీనిపై నిషేధం విధించేలా కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని రైతు కమిషన్ కోరింది. కమిషన్ సూచన మేరకు అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. మంగళవారం గడ్డి మందు నిషేధంపై తన కార్యాలయంలో వ్యవసాయ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ముఖ్యంగా అమెజాన్ (Amazon) వంటి ఈకామర్స్ సంస్థల్లో ఈ ప్రమాదకర మందు ఇంకా అందుబాటులో ఉండటంపై కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై తక్షణమే అమెజాన్ సంస్థకు నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించింది. అనంతరం, భూసార పరీక్షా కిట్ల పనితీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు భూసార పరీక్షలపై మరింత అవగాహన కల్పించాలని, నేల స్వభావాన్ని బట్టి పంటలు సాగు చేసేలా చూడాలని సూచించారు. పంట మార్పిడి విధానంపై కూడా రైతుల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు గోపాల్ రెడ్డి, భవానీ రెడ్డి, కె.వి.ఎన్ రెడ్డి, మెంబర్ సెక్రెటరీ గోపాల్, వ్యవసాయ శాఖ అధికారులు గీతారెడ్డి, సుచరిత, శ్రీధర్, కమిషన్ సిబ్బంది సంధ్యారాణి, హరి, స్రవంతి పాల్గొన్నారు.

# చిన్నారిపై అసభ్య దృశ్యాల చిత్రీకరణ

- **వరుసకు సోదరుడి అకృత్యం—**
- **నిందితుడి అరెస్ట్— టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్**

**హైదరాబాద్, మార్చి 31:**

ఐదేళ్ల చిన్నారిపై అసభ్య దృశ్యాలను చిత్రీకరించిన ఉదంతంలో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పిల్లలపై లైంగిక వేధింపులకు సంబంధించిన దృశ్యాలను నిరోధించే 'టిప్‌లైన్' ద్వారా అందిన సమాచారాన్ని బ్యూరోలోని చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ లోతుగా విశ్లేషించిందని తెలిపారు. సేకరించిన ఆధారాలను సాంకేతిక పరిజ్ఞానంతో పరిశీలించగా ఈ నేరం స్థానికంగానే జరిగిందని, బాధితురాలి తల్లిదండ్రులకు ఈ విషయం తెలియదని గుర్తించినట్లు ఆమె పేర్కొన్నారు. లోతైన దర్యాప్తు అనంతరం గోల్కొండ కుమ్మరివాడికి చెందిన మహమ్మద్ ఫహాద్ అలియాస్ ఆదిల్ (19) అనే డిగ్రీ రెండో సంవత్సరం విద్యార్థిని నిందితుడిగా గుర్తించి అరెస్ట్ చేశామని, 2026లో బ్యూరో విజయవంతంగా చిన్నారిని రక్షించిన రెండో కేసు అని వివరించారు. బాధితురాలు నిందితుడికి అత్యంత సమీప బంధువు అని, ఆ చిన్నారి అతడిని ఎంతో ఇష్టంగా భయ్యా అని పిలుస్తుండేదని డైరెక్టర్ తెలిపారు. ఆ నమ్మకాన్నే ఆసరాగా చేసుకుని నిందితుడు తరచూ బాధితురాలి ఇంటికి వెళ్లి ఎవరూ లేని సమయంలో బాలికను ఇంటిపైకి తీసుకెళ్లి అసభ్య దృశ్యాలను చిత్రీకరించేవాడని విచారణలో తేలిందని ఆమె పేర్కొన్నారు. నిందితుడి వద్ద ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాన్ని స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ పరీక్షల నిమిత్తం పంపామని, అతనిపై ఐటీ చట్టంలోని సెక్షన్ 67బితో పాటు పోక్సో చట్టంలోని వివిధ సెక్షన్ల కింద సీసీపీఎస్ లో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు స్పష్టం చేశారు. బాధితురాలికి అవసరమైన సహాయం అందజేయడంతోపాటు ఆమె తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇప్పించామని డైరెక్టర్ వివరించారు. పిల్లలపై జరిగే ఇలాంటి నేరాల్లో కుటుంబ సభ్యులు లేదా తెలిసిన వారే నిందితులుగా ఉంటున్నారని, ఇది సమాజంలో నమ్మకాన్ని వంచించడమేనని శిఖా గోయల్ ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలను ఎవరి సంరక్షణలో ఉంచుతున్నామనే విషయంలో తల్లిదండ్రులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో ఏదైనా అనుమానాస్పదంగా అనిపిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే ఫిర్యాదు చేయాలని కోరారు. పిల్లల రక్షణ అనేది మన అందరి సామూహిక బాధ్యత అని, అధునాతన సాంకేతికతతో ఇలాంటి నేరాలను అరికట్టడానికి బ్యూరో నిరంతరం కృషి చేస్తోందని డైరెక్టర్ శిఖా గోయల్ స్పష్టం చేశారు.

# 2నుంచి గ్రామసభల నిర్వహణ

- **కొత్త పథకాలపై ప్రజలకు అవగాహన**
- **కలెక్టర్లతో సిఎస్ మీడియో కాన్ఫరెన్స్**

**హైదరాబాద్,మార్చి31:**



ఏప్రిల్ 2 నుంచి గ్రామ సభలు, వార్డు సభలను కచ్చితంగా నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ సభలను పారదర్శకంగా నిర్వహించాలని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన`ప్రగతి ప్రణాళిక అమలు, పురోగతిపై మంగళవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రామకృష్ణారావు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే తెలియజేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ ప్రకారం ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ప్రజలు అధికంగా పాల్గొనేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, రాష్ట్ర బడ్జెట్‌లో ప్రకటించిన కొత్త పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సభల సందర్భంగా లబ్దిదారుల అభిప్రాయాలను సేకరించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఫీల్డ్ స్థాయిలో అమలు, ప్రజల భాగస్వామ్యం, విభాగాల మధ్య సమన్వయం ఎంతో కీలకమని సిఎస్ పునరుద్ఘాటించారు. కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా సక్రమంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్లను కోరారు.అనంతరం ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ గ్రామ సభలలో అనుసరించాల్సిన కార్యకలాపాల క్రమాన్ని కలెక్టర్లకు వివరించారు. అన్ని జిల్లాల్లో సమావేశాలు ఒకే విధంగా, సమర్థవంతంగా జరిగేందుకు నిర్మిత అజెండాను ఆయన వివరించారు. కాగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ / అర్బన్ డెవలప్‌మెంట్ కార్యదర్శి టి.కె. శ్రీదేవి మాట్లాడుతూ వార్డు సభల సందర్భంగా 100 శాతం పన్ను వసూళ్లు సాధించిన మున్సిపల్ సిబ్బందిని సత్కరించాలని సూచించారు. ఇది పట్టణ పాలనలో ఉత్తమ పనితీరును గుర్తించి ప్రోత్సహించడానికి చేపట్టిన చర్య అని ఆమె పేర్కొన్నారు. అనంతరం ఆరోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి క్రిస్టినా జోంగ్తు ప్రసంగిస్తూ ఏప్రిల్ 6 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న హెల్త్ వీక్ గురించి కలెక్టర్లకు వివరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఆరోగ్య కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలను నిర్వహించి ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడంపై దృష్టి సారించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ప్రధాన కార్యదర్శి శ్రీధర్, ఇతర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.

## పసుపు రైతులకు ప్రభుత్వం అండ

**హైదరాబాద్, మార్చి 31**

రాష్ట్రంలో అకాల వర్షాలకు నష్టపోయిన పసుపు రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తేమకు గురైన పసుపును కూడా ఎటువంటి కోతలు లేకుండా పూర్తి తూకంతో కొనుగోలు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంటూ నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డుకు భారీగా పసుపు రాక కొనసాగుతోంది. ఈనెల 30వ తేదీ వరకు సుమారు 4500 పసుపు కుప్పలు మార్కెట్ యార్డుకు చేరుకున్నాయి. వీటిలో ఎక్కువ భాగాన్ని పైకప్పు ఉన్న షెడ్లలో భద్రపరచగా, సుమారు 500 కుప్పలు బహిరంగ ప్రదేశాల్లో నిల్వ చేయబడ్డాయి. బహిరంగ ప్రదేశాల్లో ఉన్న పసుపును రక్షించేందుకు నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో 1500 టార్పాలిన్‌ల పంపిణీకి బిడ్డింగ్ ప్రక్రియ పూర్తయింది. అవసరమైన అన్ని ఏర్పాట్లు వేగంగా చేపట్టాలని అధికారులకు సూచించారు.

**తడిసిన పసుపు కోతలు లేకుండా కొనుగోలు**

ఇటీవల సంభవించిన బలమైన గాలులు, వర్షాల ప్రభావంతో సుమారు 35 నుంచి 40 మంది రైతులకు చెందిన 70 నుంచి 80 పసుపు కుప్పలు తేమకు గురయ్యాయి. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని తడిసిన పసుపును కూడా ఎటువంటి కోతలు లేకుండా కొనుగోలు చేస్తామన్నారు. మేలురకం పసుపుకు ప్రభుత్వం ఖరారు చేసిన ధరల ప్రకారం రైతులకు చెల్లింపులు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. తేమ శాతం, కోతల పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేసే మార్కెట్ యార్డు అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని మార్కెట్ యార్డు సెక్రటరీలు, డైరెక్టర్, సంబంధిత అధికారులకు ఆదేశించారు.

**నానో యూరియా వినియోగం..**

రాష్ట్ర వ్యాప్తంగా రైతులను నూతన సాంకేతికతలు, ప్రకృతి వ్యవసాయం దిశగా ప్రోత్సహించేందుకు నిర్వహించిన 'రైతు నేస్తం' 88వ ఎపిసోడ్ విజయవంతంగా జరిగింది. రాష్ట్రంలోని సుమారు 1600 రైతు వేదికల ద్వారా వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యంతో రైతులు, వ్యవసాయ అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పలువురు రైతులు తమ సాగు అనుభవాలను పంచుకోగా యాదాద్రి జిల్లాకు చెందిన సందీప్ ప్రకృతి వ్యవసాయం, స్వీయ మార్కెటింగ్ పద్ధతులపై వివరించారు. ఖమ్మం జిల్లాకు చెందిన మహేంద్ర రెడ్డి వరి సాగులో నానో యూరియా వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన మాజీ సైనికుడు నవీన్ ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై తన అనుభవాలను పంచుకుని ఇతర రైతులకు స్ఫూర్తినిచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన బాబురావు ప్రకృతి వ్యవసాయంలో తన అనుభవాలను వివరించారు.

# రెండున్నరేళ్ల నిరీక్షణకు తెర..

- **గిరిజన యువ పారిశ్రామికవేత్తలకు రూ.8.16 కోట్ల సబ్సిడీ**

**హైదరాబాద్, మార్చి 31**



గిరిజన యువ పారిశ్రామికవేత్తలకు ఆర్థిక బలాన్ని అందించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న సీఎంఎస్టీఈఐ (చీఫ్ మినిస్టర్ షెడ్యూల్ ట్రైబ్స్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ అండ్ ఇన్నోవేషన్) పథక ప్రాజెక్టులకు ఊపిరి వచ్చింది. దాదాపు రెండున్నర సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సబ్సిడీలను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ పథకం పరిధిలో మొత్తం 200 మంది అభ్యర్థులు ఎంపిక కాగా, అందులో 18 మంది తుది ప్రొసీడింగ్స్ పొందారు. ప్రాజెక్టుల అమలుకు అవసరమైన సబ్సిడీ విడుదలలో ఆలస్యం కారణంగా వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితుల్లో, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన రూ.50 కోట్లలో భాగంగా ఒక త్రైమాసిక నిధులు రూ.12.30 కోట్లు విడుదలయ్యాయి. అందులో రూ.8.16 కోట్లు 18 మంది లబ్ధిదారులకు సబ్సిడీగా అందజేశారు. ఈ పథకం ప్రకారం ప్రాజెక్టు ఆర్థిక నిర్మాణం 35 శాతం సబ్సిడీ, 55 శాతం బ్యాంకు రుణం, 10 శాతం లబ్ధిదారుడి వాటాతో అమలవుతుంది. సబ్సిడీ విడుదలతో నిలిచిపోయిన ప్రాజెక్టులు మళ్లీ గాడిలో పడే అవకాశాలు ఏర్పడ్డాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవ వల్లే ఈ సమస్య పరిష్కారమైందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మంగళవారం సచివాలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ని కలిపి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గిరిజన యువత స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగేందుకు ఇది ఒక కీలక అడుగన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ డైరెక్టర్ సంతోష్, జీఎం శంకర్ రావు, స్టేట్ మిషన్ మేనేజర్ లక్ష్మీ ప్రసాద్, డీజీఎం రవి కుమార్, అధికారులు పాల్గొన్నారు.

# ఇప్పపూవు సారాకు వేల ఏళ్ల చరిత్ర

- **దీనిపై మాట్లాడితే దుష్ప్రచారమా?**
- **మీడియా సమావేశంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**

హైదరాబాద్,మార్చి31(ఆరఎనఎ): తను ఇప్పపూవు సారా గురించి చెబితే తనపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆరోపించారు. కల్తీసారా తాగకండి అంటే తనను బద్నాం చేస్తారా అంటూ ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులకు ప్రైవసీ అనేది లేకుండా పోయిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. ఆదివాసీలు లిక్కర్ తయారుచేస్తే తప్పా? కార్పొరేట్ కంపెనీలు చేస్తే కరెక్టా? అని ఆయన ప్రశ్నించారు. ఇప్పసారాకు 3 వేల ఏళ్ల చరిత్ర ఉందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ఇప్పసారా ఇండియన్ లిక్కర్ అని ఆయన అభివర్ణించారు. ఇప్పసారాకు శతాబ్దాల చరిత్ర ఉందని అనిరుధ్‌రెడ్డి ఇటీవల వెల్లడించారు. ఈ రకమైన సారా తాగడం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుందన్నారు. గతంలో దీన్ని తాగి 110 ఏళ్లు బతికారని ఆయన వివరించారు. అనిరుధ్ వ్యాఖ్యలపై ప్రజలు తమదైన శైలిలో సోషల్ మీడియా వేదికగా స్పందిస్తున్నారు. ఈ సందర్భంగా సినీతారలపై అనిరుధ్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను డ్రగ్ టెస్ట్ చేయించుకున్నానని.. అలాగే సినీతారలు కూడా టెస్ట్ చేయించుకోవాలని ఆయన సూచించారు. వారిపైనే అధికంగా డ్రగ్స్ ర్యూమర్స్ ఉన్నాయని గుర్తుచేశారు. కానీ రాజకీయ నాయకులపై ఈ పుకార్లు తక్కువేనన్నారు. ప్రతి 90 రోజులకు ఒకసారి డ్రగ్ టెస్ట్ చేయించుకోవాలంటూ సినీనటులకు సూచించారు. డ్రగ్ టెస్ట్‌లో నెగెటివ్ వస్తేనే షూటింగ్స్‌లో పాల్గొనేందుకు అనుమతించాలని




ఆయన స్పష్టం చేశారు. డ్రగ్స్ బారినపడిన వారు చిత్ర పరిశ్రమలలోనే అధికంగా ఉన్నారని ప్రజలు భావిస్తున్నారని ఎమ్మెల్యే చెప్పారు. సీఎం రేవంత్ మద్యం, ధూమం వంటివాటికి దూరంగా ఉంటారన్నారు. తాము కూడా డ్రగ్స్‌కు దూరంగా ఉండాలనుకుంటున్నామని అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు.

## హర్మూజ్‌పై ఇరాన్ పట్టు బిగింపు



- **ఇటు వెళ్లే నౌకలకు గరిష్ఠంగా రూ.18.90 కోట్ల టోల్**

**టెహ్రాన్, 31:** చమురు రవాణాలో ప్రపంచానికి అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిపై ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మార్గంలో ప్రయాణించే నౌకలపై టోల్ వసూలు చేయడానికి ఆ దేశ పార్లమెంట్ భద్రతా కమిటీ ఆమోదం తెలిపింది. హర్మూజ్ మేనేజ్‌మెంట్ ప్రణాళికకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఇకపై ఈ జలసంధి గుండా వెళ్లే చమురు ట్యాంకర్ల నుంచి భారీ మొత్తంలో రుసుము వసూలు చేయనున్నారు. ఒక్కో ట్యాంకర్‌పై గరిష్ఠంగా సుమారు రూ.18.90 కోట్ల వరకు టోల్ విధించనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ నిర్ణయం వెనుక హర్మూజ్‌పై తమ సార్వభౌమాధికారాన్ని బలోపేతం చేయాలన్న లక్ష్యం ఉందని ఇరాన్ అధికారిక మీడియా పేర్కొంది. కొత్త విధానంలో భాగంగా సముద్ర భద్రతను పెంచడం, నౌకాయాన నియంత్రణను కట్టుదిట్టం చేయడం, ఆర్థిక నియమావళిని అమలు చేయడం వంటి అంశాలు ఉన్నాయి. అ టోల్ వ్యవస్థను అనుసరించి ఇప్పటికే 26 నౌకలు ఈ మార్గం గుండా ప్రయాణించినట్లు తెలిపింది. ఆయా నౌకలు అవసరమైన పత్రాలు సమర్పించి అనుమతి కోడ్‌లు పొందినట్లు సమాచారం. అయితే ఈ నిర్ణయంపై అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్క్ రుబియో ఈ చర్యలను వ్యంగ్యంగా విమర్శిస్తూ అంతర్జాతీయ నౌకాయాన స్వేచ్ఛకు భంగం కలిగించే చర్యలని పేర్కొన్నారు. ఇదే సమయంలో జీ7 దేశాలు కూడా ఈ నిర్ణయాన్ని తప్పుబడుతూ సముద్ర మార్గాల్లో స్వేచ్ఛాయుత రవాణా కొనసాగేందుకు తక్షణ చర్యలు అవసరమని సూచించాయి.

## ఇరాన్‌పై యుద్ధం 31వ రోజుకు

- **సెకనుకు సుమారు 9.8 లక్షలు ఖర్చు చేస్తున్న అమెరికా**

న్యూఢిల్లీ, మార్చి 31: ఇరాన్‌పై భీకరంగా దాడి చేస్తూ విధ్వంసకర పేలుడు పదార్ధాలు, క్షిపణులను అమెరికా వినియోగిస్తున్నది. చాలా ఖరీదైన ఆ ఆయుధాల వల్ల.. అమెరికా అనూహ్య రీతిలో యుద్ధం కోసం ఖర్చు చేస్తున్నది. ఇరాన్ వార్ కోసం అమెరికా ఖర్చు చేస్తున్న గణాంకాలను పరిశీలిస్తే షాక్ అవ్వాల్సిందే. ఇరాన్ వార్ కోసం ప్రతి సెకనుకు అమెరికా సుమారు 9.8 లక్షలు అంటే 10వేల డాలర్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం యుద్ధం 31వ రోజుకు చేరుకున్నది. అమెరికా పన్నుదారులకు చెందిన సుమారు 2.63 లక్షల కోట్లు ఇప్పటి వరకు ఖర్చు అయినట్లు తెలుస్తోంది. స్టాక్ హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్ పరిశోధకులు ఈ విషయాన్ని చెప్పారు. ఫిబ్రవరి 28వ తేదీన ప్రారంభమైన యుద్ధం ప్రస్తుతం భీకర స్థాయికి చేరుకున్నది. ఈ యుద్ధం కోసం ప్రతి రోజు అమెరికా ప్రభుత్వం దాదాపు 8455 కోట్లు(890 మిలియన్ల డాలర్లు) ఖర్చు చేస్తున్నది. పేలుడు పదార్ధాలు, ఎయిర్ ఆపరేషన్స్, నేవీ డిప్లోయ్‌మెంట్, మిస్సైల్ డిఫెన్స్, ఇంటెలిజెన్స్, లాజిస్టిక్‌స్‌తో అన్ని ఖర్చులు లెక్కేస్తున్నారు. ఎస్ఐపీఆర్ఐ నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. అమ్యునిషన్, మిస్సైళ్లకు ఎక్కువ ఖర్చు అవుతోంది. ప్రతి రోజు వాటి కోసం సుమారు 3040 కోట్లు ఖర్చు చేస్తున్నారు. అంటే మొత్తం ఖర్చులో అది 36 శాతంగా ఉంది. తోమాహాక్ క్రూయిజ్ మిస్సైళ్లు, జేడీఏఎం బాంబులు, ప్రిసిషన్ గైడెడ్ బాంబులు ఉన్నాయి. వైమానిక ఆపరేషన్స్ కోసం ప్రతి రోజు సుమారు 2327.5 కోట్లు ఖర్చు చేస్తున్నారు. రోజు వారి ఖర్చులో ఇది 27.5 శాతంగా ఉంది. నౌకాదళ ఆపరేషన్స్ కోసం ప్రతి రోజు సుమారు 1475 కోట్లు ఖర్చు చేస్తున్నారు. యుద్ధ నౌకల మోహరింపు, డెస్ట్రాయర్లు, సబ్‌మెరైన్లు ఈ జాబితాలో ఉన్నాయి. మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్స్ థాడ్, పాట్రియాట్, ఏజిష్ బీఎండీ కోసం ప్రతి రోజు సుమారు 902 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇది రోజువారీ ఖర్చులో 11 శాతంగా ఉన్నట్లు పరిశోధకులు చెబుతున్నారు. ఇంటెలిజెన్స్, సైబర్ ఆపరేషన్స్ కోసం 427 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఐఎస్ఆర్ ప్లాట్‌ఫామ్స్, శాటిలైట్ ఇమేజ్‌లు, సైబర్ ఆపరేషన్స్ దీంట్లో ఉన్నాయి. పర్సనల్, లాజిస్టిక్స్ కోసం ప్రతి రోజు 285 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇరాన్‌పై యుద్ధం ఖర్చు మితిమీరిన నేపథ్యంలో.. ఈ అంశంపై గల్ఫ్ దేశాలతో అమెరికా చర్చించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. యుద్ధ ఖర్చుల్లో గల్ఫ్ దేశాల సహాయాన్ని అమెరికా కోరే అవకాశాలు ఉన్నాయి. 1990లో జరిగిన గల్ఫ్ వార్ సమయంలో జపాన్, జర్మనీ దేశాలు అమెరికాకు సాయం చేశాయి. ప్రస్తుతం తమకు నష్ట పరిహారం చెల్లించాలని ఇరాన్ కూడా డిమాండ్ చేస్తున్నది. ఈ నేపథ్యంలో గల్ఫ్ దేశాలను అమెరికా సాయం కోరే ఛాన్సు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు.

## బెంగాలీలను అవమానిస్తున్న బీజేపీ

- **నా ముఖం చూసి మాత్రమే ఓటేయండి**
- **సెంటిమెంట్ మాటలతో మమత ప్రచారం**

**కోల్‌కతా, మార్చి 31:** బీజేపీపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ నిప్పులు చెరిగారు. బీజేపీని అనాగరిక పార్టీగా అభివర్ణించారు. దేశంలోని బెంగాలీ మాట్లాడే వలస కార్మికులను టార్గెట్ చేస్తున్నారని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో వారిని వేధింపులు, అవమానాలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. బాంకురాలో మంగళవారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో మమత ప్రసంగించారు. టీఎంసీ అభ్యర్థులు ఎవరనేది కాకుండా తన నాయకత్వాన్ని మాత్రమే చూడాలని ఈ సందర్భంగా వోటర్లను కోరారు. 294 నియోజకవర్గాల్లోనే తననే అభ్యర్థిగా చూడాలని విజ్ఞప్తి చేశారు. వోటర్ల జాబితాలో అవకతలను ప్రధానంగా ఆమె తన ప్రసంగంలో ప్రస్తావిస్తూ ఒకేరోజు 30,000 అప్లికేషన్లు దాఖలైనట్టు పార్టీ నేత అభిషేక్ బెనర్జీ వద్ద సమాచారం ఉందని తెలిపారు. బెంగాల్ ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేందుకు బిహార్, రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి వోటర్లను బీజేపీ దిగుమతి చేసుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తోందని ఆరోపించారు. బిహార్‌లో చేసినట్టుగానే రైల్వేలను ఉపయోగించుకుని బయట ప్రాంతాల నుంచి వోటర్లను రప్పించేందుకు బీజేపీ ప్లాన్ చేస్తోంది అని అన్నారు. భారత ఎన్నికల కమిషన్‌పై మమత తీవ్ర ఆరోపణలు చేశారు. బీజేపీ చెప్పినట్టు ఈసీఐ నడుచుకుంటోందని, బీజేపీఈసీ కలిసి ప్రజాస్వామిక, రాజ్యాంగ హక్కులను లాక్కుంటాయని ఆరోపించారు. వోటర్ల లిస్ట్‌లో కొందరిని టార్గెట్ చేసి తొలగించడం, మరికొందరిని జాబితాలో చేర్చడం జరుగుతోందన్నారు. తప్పుడు ఫారం6 అప్లికేషన్లతో బీహార్ వోటర్ల జాబితాలో చేరేందుకు ప్రయత్నించిన పలువురు బీజేపీ కార్యకర్తలు పట్టుబడినట్టు చెప్పారు. ఇది కేవలం వోటర్ల హైజాకింగ్ కిందకే వస్తుందన్నారు. చట్టబద్ధత కలిగిన 60 లక్షల అప్లికేషన్లు ఇప్పటికే పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. బల్క్ ఎంట్రీలను మాత్రం ఫాస్ట్ ట్రాక్ చేస్తున్నారన్నారు. ఇదెంతమాత్రం రొటీన్ ప్రక్రియ కాదని, స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికలు నిర్వహించడంపై జరుగుతున్న దాడి అని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే బెంగాల్‌లో మాంసాహారంపై నిషేధం విధిస్తుందని, దొడ్డిదారిన ఎన్ఆర్‌సీ తీసుకొచ్చే యత్నం చేస్తుందని ఆరోపించారు. సాంస్కృతిక ఆంక్షలు, వివాదాస్పద విధానాలు అవలంబిస్తోందని మమత అన్నారు

# గ్లోబల్ చిప్ సప్లైలో భారత్ ముందడుగు

- **స్వయం సమృద్ధి దిశగా వేగంగా అడుగులు**
- **ప్రధాని నరేంద్రమోదీ కీలక వ్యాఖ్యలు**
- **సనంద్‌లో భారీ సెమీకండక్టర్ ప్లాంట్ ప్రారంభం**

**గుజరాత్, మార్చి 31:**



ప్రపంచ సెమీకండక్టర్ రంగంలో భారత్ కీలక స్థానాన్ని సంపాదించే దిశగా ముందుకు సాగుతోందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. గుజరాత్‌లోని సనంద్‌లో ఏర్పాటు చేసిన కైనెస్ సెమీకండక్టర్ ప్లాంట్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇది సాధారణ పారిశ్రామిక ప్రాజెక్ట్ మాత్రమే కాదని, దేశం స్వయం సమృద్ధి లక్ష్యాన్ని సాధించే దిశగా తీసుకున్న పెద్ద అడుగుగా ఆయన పేర్కొన్నారు. కరోనా సమయంలో ప్రపంచవ్యాప్తంగా సరఫరా వ్యవస్థలు దెబ్బతిన్న తర్వాత సెమీకండక్టర్ తయారీలో భారత్ కూడా ముందుకు రావాల్సిన అవసరం స్పష్టమైందని ప్రధాని అన్నారు. అందుకే కేంద్ర ప్రభుత్వం 2021లో సెమీకండక్టర్ మిషన్‌ను ప్రారంభించిందని, ఇప్పుడు భారతీయ కంపెనీలు గ్లోబల్ చిప్ సప్లై చైన్‌లో భాగస్వామ్యం అవుతున్నాయని తెలిపారు. భవిష్యత్తులో భారత్ విశ్వసనీయ సెమీకండక్టర్ సరఫరాదారుగా ఎదుగుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. సనంద్‌లో ప్రారంభమైన ఈ ప్లాంట్ దేశంలో సెమీకండక్టర్ తయారీకి కీలక మైలురాయిగా నిలవనుంది. సుమారు రూ.3,300 కోట్ల పెట్టుబడితో నిర్మించిన ఈ యూనిట్‌లో అడ్వాన్స్‌డ్ ఇంటెలిజెంట్ పవర్ మాడ్యూల్స్ తయారీ జరగనుంది. ఎలక్ట్రిక్ వాహనాలు, పరిశ్రమల మోటార్ డ్రైవ్‌లు, గృహోపకరణాల్లో విద్యుత్ వినియోగాన్ని సమర్థవంతంగా నియంత్రించడంలో ఈ చిప్‌లు ముఖ్య పాత్ర పోషిస్తాయి. అన్ని దశలు పూర్తయిన తర్వాత ఈ ప్లాంట్ నుంచి భారీ స్థాయిలో ఉత్పత్తి జరగనుందని అధికారులు చెబుతున్నారు. మరోవైపు మహావీర్ జయంతి సందర్భంగా గుజరాత్‌లోని కోబా గ్రామంలో నిర్మించిన సమ్రాట్ సంప్రతి మ్యూజియంను కూడా ప్రధాని ప్రారంభించారు. జైన సంప్రదాయం, అహింసా విలువలను ప్రతిబింబించేలా ఈ మ్యూజియాన్ని తీర్చిదిద్దారు. ప్రాచీన భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వాన్ని తెలియజేసే వేలాది అరుదైన కళాఖండాలు ఇందులో ప్రదర్శనలో ఉన్నాయి. పురాతన విగ్రహాలు, నాణేలు, రాతప్రతులు, కళాఖండాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. సెమీకండక్టర్ రంగంలో భారత్ వేగంగా ముందుకు సాగుతోందని ప్రధాని మోదీ తెలిపారు. 2023లో అవగాహన ఒప్పందం కుదిరిన ప్రాజెక్ట్ కేవలం 900 రోజుల్లో పూర్తవడం దేశ సామర్థ్యానికి ఉదాహరణ అని అన్నారు. స్పష్టమైన లక్ష్యాలు, వేగవంతమైన నిర్ణయాలు ఉంటే అసాధ్యమైన పనులు కూడా సాధ్యమవుతాయని ఆయన వ్యాఖ్యానించారు. ప్రపంచ సెమీకండక్టర్ మార్కెట్‌లో భారత్ కీలక శక్తిగా ఎదగడానికి ఈ ప్రాజెక్ట్‌లు దోహదం చేస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## ఎల్‌డీఎఫ్‌తో బీజేపీ కుమ్మక్కు

- **అందుకే శబరిమలపై మాట్లాడడం లేదు**
- **మరోమారు విమర్శలు గుప్పించిన రాహుల్**
- **కేరళంలో ఉధృత ప్రచారం**

**తిరువనంతపురం, మార్చి 31:**



కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో రాహుల్ ప్రచారం ఉధృతం చేశారు. వరుసగా రెండోరోజు ఆయన వివిధ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. అధికార అధికార లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్, బీజేపీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. సిద్ధాంతాలకు వ్యతిరేకంగా బీజేపీతో ఎల్డీఎఫ్ జత కట్టిందని ఆరోపించారు. అందువల్లే ఈ ఎన్నికల్లో ఎల్డీఎఫ్ గెలవాలని మోదీ కోరుకుంటున్నారన్నారు. బీజేపీతో కూడిన ఎల్డీఎఫ్‌కు, కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్‌కు మధ్యే ఎన్నికల పోరాటం జరుగుతోందన్నారు. కన్నూరులో మంగళవారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో రాహుల్ మాట్లాడారు. స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్న సీపీఎం మాజీ నేతలు వి.ఉన్నికృష్ణన్, టీవీ గోవిందన్‌లు కూడా రాహుల్ ప్రసంగించిన వేదికపై పాల్గొన్నారు. ఈ ఎన్నికలు రెండు సిద్ధాంతాలకు మధ్య జరుగుతున్న పోరని, తొలిసారి బీజేపీలెఫ్ట్ ఫ్రంట్ చేతులు కలపడం అంతా చూస్తున్నామని రాహుల్ అన్నారు. బీజేపీతో ఎల్డీఎఫ్ జత కట్టడం ఇష్టంలేకనే ఆ పార్టీలోని కొందరు సీనియర్లు యూడీఎఫ్ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారని చెప్పారు. లెఫ్ట్ ఫ్రంట్ ఇంకెంతమాత్రం వామపక్ష పార్టీ కాదని, అతివాద రైట్‌వింగ్ పార్టీ అని పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఎక్కడకు వెళ్లినా ఆలయాలు, మతం గురించి మాట్లాడతారని.. కానీ ఇక్కడకు వచ్చినప్పుడు మాత్రం శబరిమల ఆలయంలో బంగారం తాపడాలు మాయం కావడంపై ఎందుకు మాట్లాడటం లేదని రాహుల్ ప్రశ్నించారు. రాష్ట్రంలో లెఫ్ట్ ఫ్రంట్ తిరిగి గెలవాలని ఆయన కోరుకుంటున్నారని చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం ఆక్కర లేదని అన్నారు. సీపీఎంను బీజేపీ కంట్రోల్ చేస్తోందని, యూడీఎఫ్‌ను మాత్రం కాదని చెప్పారు. తనకు సవాల్ విసరగలిగే సత్తా కాంగ్రెస్‌కు మాత్రమే ఉందనే విషయం మోదీకి బాగా తెలుసునని అన్నారు. మోదీని కాంగ్రెస్ ప్రతిఘటించడం అందరికీ తెలుసునని, కానీ మోదీని కేరళ సీఎం కానీ, కేరళ సీఎంను మోదీ కానీ విమర్శించడం ఎవరూ విని ఉండరని రాహుల్ అన్నారు.



## జైషే చీఫ్ మసూద్ సోదరుడు తాహిర్ అన్వర్ అనుమానాస్పద మృతి

న్యూఢిల్లీ, మార్చి 31: పాకిస్తాన్‌కు చెందిన జైష్‌ఎమొహమ్మద్ చీఫ్, మోస్ట్ వాంటెడ్ మౌలానా మసూద్ అజార్ సోదరుడు మొహమ్మద్ తాహిర్ అన్వర్ అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించినట్లు సమాచారం. అయితే, అతని మరణానికి సంబంధించి కారణాలు ఇప్పటికీ మిస్టరీగానే ఉన్నాయి. నిషేధిత ఉగ్రవాద సంస్థ అధికారిక ఛానల్ తెలిపిన వివరాల ప్రకారం, పాకిస్థాన్‌లోని బహవల్పూర్‌లో ఉన్న జామియా మసీద్ ఉస్మాన్ వలీలో సోమవారం అర్ధరాత్రి అన్వర్ అంత్యక్రియలు జరిగాయి. తాహిర్ అన్వర్‌కు జైష్ ఎమొహమ్మద్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. కొన్నేళ్లుగా అతను ఆ సంస్థ కార్యకలాపాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నాడని తెలుస్తోంది. పెహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకోవడానికి 'ఆపరేషన్ సింధూర్'లో భాగంగా భారత్ చేపట్టిన లక్షిత వైమానిక దాడులలో తన కుటుంబానికి చెందిన 10 మంది, తన నలుగురు సహాయకులు మరణించారని మసూద్ అజార్ గతేడాది ప్రకటించిన సంగతి తెలిసిందే. తాహిర్ అన్వర్ అనారోగ్యంతో చనిపోయాడా లేదా మరేదైనా కారణం ఉందా అనే విషయాలపై సంస్థ వివరాలు వెల్లడించడకపోవడం అనుమానాస్పదంగా మారింది.

## కేరళంలో యూడిఎఫ్ సెంచరీ ఖాయం

- **కేరళంలో యూడిఎఫ్ సెంచరీ ఖాయం**
- **మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**హైదరాబాద్, మార్చి 31 :**



కేరళంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ సారథ్యంలో గల యూడిఎఫ్ 140 సీట్లకు గాను 100కు పైగా సీట్లను గెలుచుకుంటుందని రెవెన్యూ , హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన ఆదూరు, అరుణ్ ములని యోజకవర్గాలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వయనాడ్ పార్లమెంట్ నియోజకవర్గంతో అనుబంధం కలిగిన రాహుల్ గాంధీ, రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న మహిళలను చైతన్యపరుస్తున్న కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీల ప్రచారం కారణంగా ఈసారి ప్రభుత్వ ఏర్పాటు దిశగా యూడిఎఫ్ పయనమవుతోందన్నారు. కేరళంలో తెలంగాణ తరపున ఇప్పటికే పలువురు మంత్రులు ప్రచారంలో పాల్గొంటున్నారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా వివిధ సభల్లో ప్రసంగిస్తారని అన్నారు. లోక్‌సభ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలు ప్రజల మనసులో మార్పు వాతావరణాన్ని స్పష్టంగా చూపించాయి. ఇప్పుడు అదే ఉత్సాహంతో శాసనసభ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ కు అఖండ మెజార్టీ ఇవ్వాలని మంత్రి కోరారు. ఈసారి 100కి పైగా సీట్లు గెలవడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. గత పదేళ్లలో పాలనాపరంగా లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) విఫలమైందని, అదేవిధంగా బిజేపీ నేతృత్వంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్‌డీఏ)ను ప్రజలు తిరస్కరిస్తున్నారని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో యూడిఎఫ్ మాత్రమే కేరళంను అభివృద్ధి పథంలో నడిపించగలదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

## నలందలో ఆలయంలో వద్ద తొక్కిసలాట

- **8మంది మహిళా భక్తుల మృత్యువాత**

**పాట్నా, మార్చి 31:**

బీహార్‌లోని నలందలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. నలందలో ఒక ఆలయం వద్ద తొక్కిసలాట జరిగింది. నలంద జిల్లాలోని శీతలా మాత ఆలయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందారు. అందరూ మహిళలే కావడం గమనార్హం.ఈ ఘటనలో మరో 12 మందికి పైగా గాయపడ్డారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఈ తొక్కిసలాట చోటు చేసుకుంది. నలంద జిల్లాలోని బీహార్ షరీఫ్‌కు దాదాపు ఐదు కిలోటర్ల దూరంలో ఉన్న మఘ్రా గ్రామంలోని శీతలాష్టమి ఆలయం వద్ద ఈ తొక్కిసలాట జరిగింది. చైత్ర మాసంలోని చివరి మంగళవారం కావడంతో, ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అధిక సంఖ్యలో మహిళలు మంగళవారం నాడు ఈ గుడికి వస్తుంటారు. నిర్వహణ లోపం కారణంగానే ఈ తొక్కిసలాట జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పదుల సంఖ్యలో మహిళలు స్పృహ తప్పిపోడిపోయిన దృశ్యాలు కలవరపెడుతున్నాయి. బాగా రద్దీగా ఉండడంతో అంబులెన్‌స్‌లు కూడా అక్కడకు చేరుకోవడం ఇబ్బందిగా మారింది. గాయపడిన వారికి స్థానికులు సపర్యలు చేస్తున్నారు. చేతులతో ఎత్తుకుని అంబులెన్‌స్‌ల వద్దకు తీసుకెళ్తున్నారు.



## అసోంలో మహిళలకు రూ.3 వేల తాయిలం

- **31 హామీలతో బిజెపి మేనిఫెస్టో విడుదల**

**గౌహతి,మార్చి31:**

త్వరలో ఎన్నికలు జరగనున్న అస్సాంలో మంగళవారం బిజెపి సంకల్ప పాత్ర పేరుతో 31 హాలతో మేనిఫెస్టోను విడుదల చేసింది. ఈ హాల్లో కీలకంగా ఉమ్మడి పౌరస్మృతి (యుసిసి), మహిళలకు అరుణోదరు పథకం కింద నెలకు మూడువేల రూపాయల్ని నేరుగా తమ బ్యాంకు అకౌంట్లలో జమ చేయడం వంటివి ఉన్నాయి. మేనిఫెస్టో విడుదల సందర్భంగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ మాట్లాడుతూ.. 'అస్సాంని ప్రకాశవంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దడమే బిజెపి లక్ష్యంగా పెట్టుకుంది' అని ఆయన అన్నారు. ఉత్తరాఖండ్, గుజరాత్ రాష్ట్రాల మాదిరిగానే అస్సాంలో కూడా యుసిసిని అమలు చేయడమే బిజెపి అజెండా అన్నారు. అలాగే లవ్ జీహాద్‌కు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటాం అని ఆయన అన్నారు. యుసిసిని రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల పరిధిలోకి వచ్చే ప్రాంతాల నుంచి మినహాయిస్తామని, గిరిజన వర్గాల్లో దీని అమలు చేయమని ఆయన అన్నారు. రద రహిత అస్సాంను మార్చేందుకు రాబోయే రెండేళ్లలో 18 వేల కోట్లను ఖర్చు చేస్తాం. లక్షపతి దీదీ పథకం కింద 40 లక్షల మంది మహిళలకు 25 వేల రూపాయలు అందిస్తాం. వచ్చే ఐదేళ్లలో రెండు లక్షల జాబ్‌లు ఇస్తాం. ఒక జిల్లా, ఒక కళాశాల, ఒక విశ్వవిద్యాలయం, ఒక ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేస్తాం. అరుణోదరు పథకం కింద ఇస్తున్న రూ. 1250లను పెంచి మహిళలకు 3,000లు అందించడానికి ప్రయత్నిస్తాం అని హిమంతబిశ్వ శర్మ అన్నారు. మేనిఫెస్టో విడుదల కార్యక్రమంలో సిఎం హిమంత బిశ్వ శర్మ, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, సర్బానంద సోనోవాల్, ఆ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు దిలీప్ సైకియా హాజరయ్యారు.



# సమర్ధవంతంగా అభివృద్ధి పనులు

- డివిజనల్ పంచాయతీ అధికారి అనిత
- అనంతారం గ్రామం సందర్శన

**గుమ్మడిదల, మార్చి 31( సిరి న్యూస్):**



గుమ్మడిదల మండలం అనంతారం గ్రామాన్ని సంగారెడ్డి డివిజనల్ పంచాయతీ అధికారి అనిత సందర్శించారు. గ్రామ సర్పంచ్ కొమ్ము శ్రీనివాస్‌ను కలిసి గ్రామంలో అమలవుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై మంగళవారం వివరాలు తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో నూతనంగా ప్రారంభించిన ప్రైమరీ పాఠశాల మరియు జిల్లా పరిషత్ పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, పాఠశాల నిర్వహణపై అధికారుల వద్ద వివరాలు కోరారు. అలాగే గ్రామంలోని నర్సరీ, వైకుంఠ ధామాలను కూడా పరిశీలించి వాటి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఎల్పీఓ మాట్లాడుతూ గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులు సమర్ధవంతంగా జరుగుతున్నాయని, ముఖ్యంగా పాఠశాలలు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాలు ఆదర్శప్రాయంగా ఉన్నాయని తెలిపారు. గ్రామాభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇంకా ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తూ గ్రామాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి దయాకర్ రావు, పంచాయతీ కార్యదర్శి సురేష్ యాదవ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

# బెట్టింగ్ కు పాల్పడితే కఠినచర్యలు

**ఝరాసంఘం, మార్చ్31(సిరిన్యూస్)**



ఐ పి ఎల్ ప్రారంభమైంది కావున యువత ఆటలోని వినోదాన్ని ఆస్వాదించాలి. అంతే కానీ బెట్టింగ్ చేయవద్దు,ఒక వేళ బెట్టింగ్ కు పాలపడినట్లు రుజువైతే,చర్యలు చాలా కఠినంగా ఉంటాయని పోలీస్ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల ప్రభావం వేలాది యువత జీవితాలను నాశనం చేస్తోంది. సెటింగ్ చేసి గెలిపిస్తామని నమ్మించి, చివరికి పూర్తిగా నష్టపోయేలా చేస్తూ లక్షల రూపాయలుగా వంచించడం ఈ యాప్‌ల ప్రధాన వ్యూహంగా మారింది. మరింత డబ్బు సంపాదించాలనే దురాశతో యువత అప్పుల్లో కూరుకుపోతోంది. ఆ అప్పులు తీర్చలేక యువత ఆత్మహత్యలకు పాల్పడడం తీవ్ర విషాదకరమైన పరిణామంగా మారింది. చట్టబద్ధంగా ఈ బెట్టింగ్ యాప్‌లు నిషేధించబడినప్పటికీ, ప్రజల్లో అవగాహన లేకపోవడంతో చాలా మంది మోసపోతున్నారు.తెలంగాణ పోలీసులు ఆన్‌లైన్ బెట్టింగ్ భూతాన్ని పూర్తిగా ఎండగట్టే దిశగా కీలక చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటివరకు బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసిన సినీ సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లకు నోటీసులు జారీ చేసి, వారిపై కేసులు నమోదు చేశారు.ఇప్పుడు ఆ యాప్‌ల అసలు యజమానులపై నేరపూరిత చర్యలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు.కాబట్టి యువత ఇలాంటి బెట్టింగ్ అప్ బారిన పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఝరాసంఘం సబ్ ఇన్స్పెక్టర్ క్రాంతికుమార్ పాటిల్ యువతను ఉద్దేశించి సూచనలు చేశారు.

# ఇసుక వేలంలో హోరాహోరి

## 80.5 వేలకు 25 ట్రిప్పులు దక్కించుకున్న సుధాకర్




**నార్సింగి, మార్చి 31 (సిరి న్యూస్) :**

మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన ఇసుక బహిరంగ వేలం పాట విజయవంతంగా ముగిసింది. తహసీల్దార్ గ్రేసీ బాయి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలం పాట కు మంచి స్పందన లభించింది. మొత్తం 8 మంది పాల్గొన్న ఈ వేలంలో 25 ట్రిప్పుల ట్రాక్టర్ ఇసుకకు గట్టి పోటీ నెలకొంది. చివరికి గుర్రాల సుధాకర్ రూ.80 వేల 500 కు వేలాన్ని దక్కించుకున్నారు. వేలం పాట అనంతరం తహసీల్దార్ గ్రేసీ బాయి మాట్లాడుతూ, ఇసుక తరలింపులో పారదర్శకత పాటించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రతి ట్రిప్ కు సంబంధించిన ట్రాక్టర్ నంబర్ ను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల లోపు మాత్రమే ఇసుక రవాణా చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భోజనం పెట్టమన్నందుకు మోకాళ్లపై నిలబెట్టారు !

- బీసీ హాస్టల్ విద్యార్థినుల పట్ల ప్రిన్సిపాల్ దాష్టికం !
- ఉన్నది తినాలి చెప్పింది వినాలి లేదంటే మోకాళ్లపైనే నిల్చోవాలి !
- చిన్నారులను గంటపాటు చీకట్లో శిక్ష !
- కడుపు నిండ లేదన్న వాళ్ళు ఇక రోజు ఇలా పస్తులతోనే నిల్చోవాలంటూ వార్నింగ్ !!
- గురుకుల పాఠశాలలో విద్యార్థినుల పట్ల అమానుషం !
- నల్గొండ జిల్లా దామరచెరువు గురుకుల వసతి గృహంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన !!

**హైదరాబాద్ మార్చి 31:(సిరి న్యూస్ ).**

అన్నం కావాలా ?పెట్టింది తిని చెప్పింది విని చదువుకోక అన్నం కావాలని ఉద్యమం చేస్తారా అంటూ ..కడుపు నిండ లేదని కాసింత అన్నం పెట్టమన్న పాపానికి రాత్రివేళలో కాలి కడుపులతో ఉన్న చిన్నారులను మోకాళ్ళ మీద నిల్చో బెట్టిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది,నల్గొండ జిల్లా దామరచర్లలో వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాలలో రెండ్రోజుల క్రితం జరిగిన ఈ సంఘటనలో ప్రిన్సిపాల్ ప్రవర్తించిన తీరుపై సర్వత్రా నిరసనలు వ్యక్తం అవుతున్నాయ్. వివరాల్లోకి వెళితే నల్గొండ జిల్లా దామరచెరువు గ్రామంలో ఉన్న బీసీ గురుకుల విద్యాలయంలో వసతి గృహం కూడా ఉంది.ఇందులో వందకు పైగా పేద విద్యార్థినిలు చదువుకుంటున్నారు.ఇక్కడ చాల రోజులుగా సరియైన భోజనం పెట్టడంలేదంటూ ఆరోపణలు ఉన్నాయ్.ఈ నేపత్యంలో రెండ్రోజుల క్రితం విద్యార్థినులు తమకు అన్నం సరిపోలేదని ఇంకొంచమ్ పెట్టాలని వడ్డించే వారిని కోరారు.ఐతే అక్కడ వండిన కొద్దిపాటి వంట అయ్యిపోవడంతో వాళ్ళు విద్యార్థులు ఇంకా అన్నం కావాలంటున్నారని ప్రిన్సిపాల్ కు తెలిపారు.విషయం తెల్సుకున్న ప్రిన్సిపాల్ ఆగ్రహంతో ఊగిపోయింది.అందరిని ఒక్క చోట పిలిచి అన్నం ఇంకా కావాలన్నా వారందరు మోకాళ్లపై నిల్చోవాలని ఆదేశించింది.చీకటిలో పిల్లలను గంటపాటు మోకాళ్లపైనే నిల్చో పెట్టి తిన్నది సరిపోయిందన్న వాళ్లకు వెళ్లి పడుకోండి.లేదని తిన్నాక కూడా తినలేదని దోస్తులకోసం ఇలాగే మోకాళ్లపై ఉంటామంటే ఉండండంటూ పిల్లలను భయబ్రాంతులకు గురిచేసింది.నిజానికి అసలు వాళ్లకు ఎవ్వరికి అన్నం సరిపోక పోవడంతో అందరు మోకాళ్లపై నిల్చోవాల్సి వచ్చింది .ఇదే విషయాన్ని అక్కడే ఉన్న ఒక అజ్ఞాత వ్యక్తి వీడియో తీసి సోషల్ మీడియాకు విడుదల చేయడంతో వాస్తవం రెండ్రోజుల తర్వాత వెలుగులోకి వచ్చింది.

**మునుగోడు ఎమెల్యే నిన్న చెప్పింది ఇదేనా ?**

ప్రభుత్వ గురుకులాలలో విద్యార్థులకు సరైన వసతులు లేవని నిన్న మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించారు.హాస్టల్ లో ఉండేవాళ్ళు పెట్టింది తినాలి చెప్పింది చేయాలి ..తిన్నామా పడుకున్నామా అన్నట్టు ఉండాల్సిందే తప్ప ప్రశ్నించడం కానీ ప్రస్తావించడం కానీ కుదరదన్నట్టు హాస్టళ్ల పరిస్థితి ఉందని అయన పేర్కొన్నారు.వసతులు లేకుండా పిల్లలు ఎలా ఉన్నతమైన చదువులు నేర్చుకోగలరని అయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు .ఇంతలోనే అదే జిల్లాలో బీసీ హాస్టల్ లో జరిగిన సంఘటన వెలుగులోకి రావడంతో ఆయనకు విషయం తెలిసి మాట్లాడారా?జరుగుతున్న వాస్తవాన్ని వివరించే ప్రయత్నం చేసారా !?అనేది ఇప్పుడు పెద్ద చర్చగా మారింది.ఏది ఏమైనా ఆర్థికంగా వెనకబడి చదువు కొనసాగాలని కోటి ఆశలతో హాస్టల్ కొస్తే కడుపు నిండా తినడానికే పోరాటాలు చేయాల్సి రావడం బాధ పడాల్సిన విషయం .ప్రశ్నిస్తే విద్యార్థులను మోకాళ్లపైన నిల్చోబెట్టడం అత్యంత కిరాతకమైన చర్య .ఈ విషయంపై మరింత దర్యాప్తు చేసి ప్రిన్సిపాల్ పై కఠిన చర్యలు తీసుకోవాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు

# జంగారాయిలో బాధితులకు ఎస్పీ పరామర్శ





- 48 గంటల్లో దోపిడీ కేసు ఛేదన.
- బాధితులకు భరోసా ఇచ్చిన ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు.

**రామాయంపేట, మార్చి 31(సిరి న్యూస్)**

చిన్న శంకరం పేట మండలంలోని జంగారాయి గ్రామంలో వృద్ధ దంపతులను మంగళవారం నాడు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పరామర్శించారు. ఇటీవల జిల్లాలో సంచలనం సృష్టించిన దోపిడీ కేసును పోలీసులు కేవలం 48 గంటల్లోనే ఛేదించారు. కేసు దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నిందితుడిని వేగంగా గుర్తించి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి బంగారాన్ని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.బాధితులు సావిత్రి, అంజయ్యలను ఎస్పీ పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ ఘటనతో కలిగిన భయాందోళనలను తొలగిస్తూ, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. నిందితుడికి చట్టపరంగా కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు.ఇదిలా ఉండగా, కేసు ఛేదనలో కీలక పాత్ర పోషించిన పోలీసుల పనితీరుపై జంగరాయి గ్రామ ప్రజలు ప్రశంసలు కురిపించారు. జిల్లా ఎస్పీని శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజలు అందించిన సమాచారంతోనే నిందితుడిని త్వరగా గుర్తించి పట్టుకోవడం సాధ్యమైందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా క్లూస్ అందించిన గ్రామస్థులను ఎస్పీ శాలువాలతో సన్మానించారు. ప్రజలు—పోలీసులు సమన్వయంతో పనిచేస్తే నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని ఆయన తెలిపారు. ప్రజల సహకారం లేకుండా నేరాల నియంత్రణ సాధ్యం కాదని అన్నారు.అదేవిధంగా గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు అవసరమని ఎస్పీ సూచించారు. సీసీ కెమెరాలు నేరాల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తాయని, ప్రతి గ్రామంలో భద్రతా చర్యలను బలోపేతం చేయాలని చెప్పారు. అనుమానితుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసులకు సమాచారం అందించాలని డివి శ్రీనివాసరావు కోరారు.ఈ సందర్భంగా ఎస్పీ వెంట తూప్రాన్ డియస్పి నరేందర్ గౌడ్, సిఐ లు వెంకట రాజా గౌడ్, సందీప్ రెడ్డి, ఎసై నారాయణ, సిబ్బంది, గ్రామ ప్రజలు ఉన్నారు.





# ఓం నమశ్శివాయః కళ్యాణమహోత్సవ సందడి

- జోగిపేట వేలాదిగా హజరైన భక్తులు, మహిళలు
- పాల్గొన్న మంత్రి దామోదర రాజనర్సింహకు స్వాగతం

**అందోలు, మార్చి 31, (సిరి న్యూస్):**





జోగిపేట పట్టణంలో ప్రసిద్దిగాంచిన శ్రీ జోగినాథ రథోత్సవాల్లో భాగంగా మంగళవారం శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక వీరహనుమాన్ దేవాలయం నుంచి శివపార్వతుల విగ్రహాలను ఎండ్లబండిపై డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా జోగినాథుడి అలయం వరకు తీసుకొచ్చారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో కళ్యాణోత్సవాన్ని ఆలయ పూజరులు వీరభద్రప్ప, సిద్దేశ్వర్, సుజిత్ స్వాములు వేద మంత్రోచ్చరణల మధ్య స్థానిక వ్యాపారులు పిర్లమర్ల నాగరాజ్, చింతల రాకేష్, సీహెచ్.శివకుమార్ దంపతులు కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు. వేలాది మంది భక్తులు కల్యాణ వేడుకకు హజరయ్యారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు), రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ఎస్.సురేందర్‌గౌడ్, రంగ సురేష్, పి. ప్రవీణ్‌కుమార్, నాని నాగరాజ్, లక్ష్మణ్, నర్సింలు, భిక్షపతి, వెంకటేశం, అనిల్, రవి, యాదగిరి, నాగరాజ్, ప్రేమ్‌కుమార్, భూమయ్య, కౌన్సిలర్‌లు పట్లోళ్ల శ్రీనివాస్, కొశికె రాజశేఖర్, అరుణ్ కుమార్, మాజీ ఏఎంసీ చైర్మన్ మల్లిఖార్జున్, మాజీ ఎంపీపీ హెచ్.రామాగౌడ్, మాజీ ఎంపీటీసీ డీజీ.వెంకటేశం, నాయకులు మహేష్ యాదవ్, అశోక్, శ్రీనివాస్, నాగరాజ్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు. కళ్యాణోత్సవానికి హజరైన మంత్రి దామోదర జోగిపేటలోని శివపార్వతుల కల్యాణ మహోత్సవానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సీ.దామోదర్ రాజనర్సింహ హజరయ్యారు. వేద పండితులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఆయనకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ముందుగా జోడు లింగాల వద్ద ప్రత్యేక పూజలు చేసిన మంత్రి కల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. అయనకు ఆలయ కమిటీ సభ్యులు శాలువాలను కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. మంత్రితో పాటు ఆదనపు కలెక్టర్ పాండు హజరయ్యారు. అనంతరం రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి హజరు కాగా, ఆయనకు కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. జోడు లింగాలను దర్శించుకుని, కల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు.

# భూగర్భ జలాల సమస్యలపై ప్రత్యేక చర్యలు

- చైర్మన్ కుమార్ గౌడ్
- 12వ వార్డులో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం
- బోరు పనులకు శంకుస్థాపన



**గుమ్మడిదల, మార్చి 31 (సిరి న్యూస్ ):**

పురపాలక సంఘం కేంద్రమైన గుమ్మడిదలలోని 12వ వార్డులో నెలకొన్న తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు నూతన బోరు ఏర్పాటుకు శంకుస్థాపన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ ఆకుల మాధవి సత్యనారాయణ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్, కమిషనర్ దశరథ్ కలిసి పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ మాట్లాడుతూ 12వ వార్డులో గత కొంతకాలంగా తీవ్రమైన తాగునీటి సమస్యలు నెలకొన్నాయని తెలిపారు. వేసవి కాలంలో నీటి కొరత మరింత తీవ్రమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పాత బోర్లు పనికిరాకపోవడం, భూగర్భ జలాల మట్టం తగ్గిపోవడం వల్ల సమస్యలు అధికమయ్యాయని పేర్కొన్నారు. ప్రజలు దూర ప్రాంతాల నుంచి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకుని మున్సిపాలిటీ ప్రత్యేక చర్యలు చేపట్టిందని, నూతన బోరు ద్వారా కాలనీలోని ప్రతి ఇంటికి తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా మరిన్ని బోర్లు, పైపులైన్ విస్తరణ పనులు చేపడతామని తెలిపారు. ప్రజల ప్రాథమిక అవసరాలైన నీరు, విద్యుత్, పారిశుధ్యం అంశాల్లో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్య గోవర్ధన్ రెడ్డి, వార్డు కౌన్సిలర్స్ నరేందర్ రెడ్డి, ప్రమీల, మురళి, కిషన్, రాజి రెడ్డి, సి జి ఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, నాయకులు వెంకట్రాం రెడ్డి , పొన్నాల శ్రీనివాస్ రెడ్డి , హుస్సేన్, ఆంజనేయులు యాదవ్ , మద్దెటి మల్లేష్ యాదవ్, మద్దెటి బాల్ రాజ్ యాదవ్, కుంటి శ్రీనివాస్, కుంటి రవి, అధికారులు, కాలనీ వాసులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వేలం వేయాల్సిన ఇసుక తస్కరణ

- 10 ట్రాక్టర్ల ఇసుక మాయం, జే.సీ.బీ, ట్రాక్టర్లు స్వాధీనం



**నార్సింగి, మార్చి 31 (సిరి న్యూస్) :**

నార్సింగి గ్రామ శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక ను రెవెన్యూ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు గుండు చెరువు వాగు నుండి తీసిన ఇసుక ను బాబు మేస్త్రి అనే వ్యక్తి స్థలంలో కుప్పలుగా నిల్వ ఉంచినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో మార్చి 30 న ఉదయం 11:15 గం రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీధర్ సంఘటన స్థలానికి చేరుకుని పంచు ల సమక్షంలో ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇసుక కుప్ప లకు సున్నంతో మార్కింగ్ చేశారు. స్వాధీనం చేసుకున్న ఇసుకను మంగళవారం వేలం వేస్తామని తహసీల్దార్ ప్రకటించారు. అయితే, మార్చి 31 అర్ధరాత్రి సమయంలో శాలీపేట కు చెందిన బుస్స రాజు అనే వ్యక్తి సీజ్ చేసిన ఇసుకను ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా తస్కరించినట్లు సమాచారం అందింది. దీంతో స్థానిక ఎస్ఐ బీమరి సృజన పోలీసు సిబ్బంది, అధికారులు అక్కడికి చేరుకుని పరిశీలించగా దాదాపు 10 ట్రాక్టర్ల మేర ఇసుకను తస్కరించినట్లు గుర్తించి, అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఒక జే.సీ.బీ, మూడు ట్రాక్టర్లు ట్రాలీ లతో సహా స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాలను నార్సింగి తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణానికి తరలించారు. జీపీఓ మాసుల నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బీమరి సృజన తెలిపారు.

# పురపాలక బడ్జెట్ కు గ్రీన్ సిగ్నల్

- 15.96 కోట్ల బడ్జెట్ కు ఆమోదం




**జిన్నారం మార్చి 31 సిరి న్యూస్**

జిన్నారం పురపాలక సంఘం సమావేశంలో బడ్జెట్ కు ఆమోదం, మొత్తం 15.96 కోట్ల బడ్జెట్ను ఏకగ్రీవంగా ఆమోదించిన సభ్యులు, మంగళవారం ఉదయం ఎంపీపీ కార్యాలయంలో సమావేశం, చైర్మన్ జనార్ధన్ ఆధ్వర్యంలో పురపాలక సంఘం సమావేశం జరిగింది. సభ్యుల సూచనలు అభిప్రాయాలను పరిగణలోకి తీసుకున్నారు. అనంతరం బడ్జెట్ కు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఇందులో సొంత నిధులు 3.04 కోట్లు కేటాయింపు, వివిధ గ్రాండ్ల కింద 12.92 కోట్లు ప్రతిపాదన, రూపొందించి కౌన్సిల్ ఆమోదం తీసుకోవడం జరిగిందని తెలిపారు. పురపాలక బడ్జెట్ గ్రీన్ బడ్జెట్ కు 30 లక్షల కేటాయింపు, సిబ్బంది జీతాల కోసం 98 లక్షలు కేటాయింపు ప్రతిపాదన చేశారు. సానిటరీ ఖర్చులకోసం 26 లక్షలు మరియు ఇంజనీరింగ్ పనులు మరియు నీటి సరఫరా కోసం 15 లక్షల కేటాయింపు చేశామని కమిషనర్ తెలిపారు. పట్టణ పారిశుద్దానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చిన అధికారులు తాగునీటి సరఫరా మెరుగుదలకు చర్యలు తీసుకునే నిర్ణయం, ఇంజనీరింగ్ విభాగం పనులు వేగవంతం చేయాలని సూచనలు చేశారు.మున్సిపల్ కమిషనర్ తిరుపతి వివరాలు వెల్లడించారు.ఈ బడ్జెట్ సమావేశంలో వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి,కౌన్సిలర్లు అధికారులు పాల్గొన్నారు

# విద్యార్థులపై దాడి చేసిన టీచర్ను సస్పెండ్ చేయాలి

- గిరిజన జన సమితి డిమాండ్



**కౌడిపల్లి మార్చి 31 సిరి న్యూస్**

మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలోని గిరిజన గురుకుల పాఠశాలలో విద్యార్థులపై అమానుషంగా ప్రవర్తిస్తున్న ఉపాధ్యాయుడు ఉదయ్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని గిరిజన జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వినోద్ నాయక్ డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలలో జరుగుతున్న ఘటనలపై సోమవారం వివిధ పత్రికల్లో వచ్చిన వార్తా కథనాల నేపథ్యంలో మంగళవారం పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయుడే వారిపై కక్షగట్టినట్లు ప్రవర్తించడం అత్యంత దురదృష్టకరమని మండిపడ్డారు. విద్యార్థులు తమ గోడును నాయకుల ముందు వెల్లగక్కారు. సదరు ఉపాధ్యాయుడు తమను కులం పేరుతో దూషిస్తున్నారని, ఎలాంటి కారణం లేకుండానే కొడుతూ శారీరక, మానసిక వేధింపులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన జన సమితి నాయకులు తమ ప్రధాన డిమాండ్లను వెల్లడించారు. విద్యార్థులను వేధిస్తున్న ఉపాధ్యాయుడు ఉదయ్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని, కులం పేరుతో దూషించినందుకు ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే గురుకుల పాఠశాలలో విద్యార్థులకు భద్రత కల్పిస్తూ, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటూ వారిని శారీరకంగా, మానసికంగా వేధిస్తున్న ఇలాంటి వ్యక్తులను ఉపేక్షించబోమని, ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు తీసుకోకపోతే గిరిజన జన సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన జన సమితి మెదక్ జిల్లా అధ్యక్షుడు దేవి చంద్ రాథోడ్, రాష్ట్ర కన్వీనర్ రమేష్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

# మొబైల్ నెట్వర్క్ లను అభివృద్ధి చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల మార్చి 31 సిరి న్యూస్**

ప్రభుత్వ, ప్రైవేట్ మొబైల్ నెట్వర్క్ లు తమ సేవలను గ్రామీణ స్థాయి నుంచి విస్తరించి ప్రజలకు మెరుగైన నెట్వర్క్ సేవలను అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి టెలికాం కమిటీ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, శ్రీనివాస్ రావులతో కలిసి ప్రైవేట్ నెట్ వర్క్, టి-ఫైబర్ నెట్ వర్క్ ప్రతినిధులు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నెట్వర్క్ సేవలను గ్రామీణ స్థాయిలో మరింత అభివృద్ధి చేసి నాణ్యమైన సిగ్నల్స్ అందించే దిశగా కృషి చేయాలని తెలిపారు. టెలికాం టవర్ సైట్లకు విద్యుత్ సరఫరా విస్తరణ, ప్రభుత్వ సంస్థలకు బ్రాడ్ బ్యాండ్ కనెక్టివిటీ, చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రైవేట్ నెట్వర్క్ లు టవర్ల ఏర్పాట్లలో నిబంధనల ప్రకారం మార్కెట్ ధరతో చెల్లింపులకు హామీ ఇస్తే ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పిస్తామని అన్నారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సామ్యతాండాలో నీటి సమస్యను పరిష్కరించిన సర్పంచ్

## తేజస్వినిరాజేందర్ నాయక్ !!



**శివంపేట మార్చ్ 31 ( సిరి న్యూస్ )**

శివంపేట మండల కేంద్రంలోని టిక్య దేవమ్మ గూడెం గ్రామపంచాయతీ పరిధిలోని సామ్యతాండాలో నీటి సమస్యతో బాధపడుతున్నామని గిరిజన సోదరులు స్థానిక సర్పంచ్ తేజస్విని రాజేందర్ దృష్టికి తీసుకువెళ్లారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని తక్షణమే బోర్ వేయించడం జరిగింది. ఆ బోరులో నీరు పుష్కలంగా పడడంతో గిరిజన సోదరులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా కొవ్వూరి సంగమేశ్వర్ నియామకం

**సదాశివపేట. మార్చి 31. (సిరిన్యూస్)**



తెలంగాణ రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులుగా కోవూరు సంగమేశ్వర్ ను బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు నియమించడం జరిగింది. ఈ సందర్భంగా కొవ్వూరు సంగమేశ్వర మాట్లాడుతూ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా రెండవసారి అవకాశం రావడం తాను అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు. రాష్ట్రంలో బిజెపి మరింత బలోపేతంగా చేయడానికి కృషి చేస్తానని, తనకు అవకాశం కల్పించిన రాష్ట్ర బిజెపి పార్టీ పెద్దలు ఎంపీ రఘునందన్ రావు, మాజీ ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి మరియు పార్టీ కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# అన్ని మతాల ప్రజలతో ఈద్ మిలాన్ వేడుక



**మునిపల్లి మార్చి 31 (సిరి న్యూస్)**

మునిపల్లి మండలంలోని మగ్దూంపల్లి గ్రామంలో జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో ఆదివారం ఈద్ మిలాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నాజీముద్దీన్ గౌరీ, గ్రామ శాఖ అధ్యక్షుడు మక్బూల్ అహ్మద్ ఈద్ మిలాన్ ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు.అతిథులు మాట్లాడుతూ ఈద్ మిలాన్ అనేది రంజాన్ పండుగ తర్వాత అన్ని కులాలు, అన్ని మతాలకు అతీతంగా అందరిని ఆహ్వానించి నిర్వహించే సౌహార్ద పండుగ అని పేర్కొన్నారు. ప్రేమ, సానుభూతి, సౌభ్రాతృత్వం, సమానత్వం——ఇవి ఈ పండుగ యొక్క ప్రధాన సందేశాలు అని తెలిపారు.కార్యక్రమంలో టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సాయికుమార్, కాంగ్రెస్ పార్టీ మండల ఉప అధ్యక్షుడు రసూల్ పటేల్, గ్రామ సర్పంచ్ సరళ దయానంద్, మాజీ ఉప సర్పంచ్ సంగమేశ్వర్, జంషీద్, ఎంపల్లి నాగిశెట్టి, చాంద్ భాషా పటేల్, చెల్మెడ వీరన్న గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.గ్రామంలో అన్ని వర్గాల ప్రజలు కలిసి పాల్గొనడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# ఆన్లైన్ మోసాలకు గురైతే 1930కు సమాచారం అందించాలి



**జైనూర్ మార్చి 31 సిరి న్యూస్**

ఆన్లైన్ మోసాలకు గురైతే వెంటనే 1930కు సమాచారం అందించాలని ఎస్సై రామకృష్ణ అన్నారు. సిర్పూర్(యు) మండలంలోని భుర్నూర్ గ్రామంలో మంగళవారం మహిళల భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ, ఆన్లైన్ మోసాలు, యాంటీ డ్రగ్స్ వంటి అంశాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అత్యాశకు లోనై చాలా మంది సైబర్ క్రైమ్, ఆన్లైన్ మోసాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా లోన్ యాప్‌ల మోసాలకు దూరంగా ఉండాలని సూచించారు. మహిళలకు ఏదైనా ప్రమాదం, బెదిరింపులు ఎదురైతే డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు.

# కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



బెజ్జూర్ మార్చి 31 సిరి న్యూస్

మిషన్ భగీరథ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం బెజ్జూర్ తహశీల్దార్ భీమ్లా నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ బెజ్జూర్ మండలంలో వాల్ ఆపరేటర్లు, ఇతర విభాగాల్లో పనిచేస్తున్న తమకు గత నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా ఎలాంటి ఫలితం లేదని తెలిపారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఎంపీడీఓ, తహశీల్దార్ కార్యాలయాల్లోని అధికారులకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను సమర్పించినట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# బీఆర్ఎస్‌కు షాక్

## తెలంగాణ జాగృతిలోకి కూర సురేష్ పటేల్



గంభీరావుపేట మార్చి 31 సిరి న్యూస్

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, రాష్ట్ర మున్నూరుకాపు ఆర్గనైజింగ్ సెక్రటరీ కూర సురేష్ పటేల్ తెలంగాణ జాగృతిలో చేరారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఆ సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆయనకు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎర్ర నరసయ్య, రంగారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూర సురేష్ పటేల్ మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గాల అభివృద్ధి అత్యంత అవసరమని పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి ద్వారా బీసీ వర్గాలకు న్యాయం జరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. 2001లో ప్రారంభమైన తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం నుంచే రాజకీయంగా చురుకుగా ఉన్న కూర సురేష్ పటేల్ మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన ప్రముఖ నాయకుడిగా గుర్తింపు పొందారు. రాష్ట్ర స్థాయిలో ఆర్గనైజింగ్ సెక్రటరీగా పనిచేస్తూ బీఆర్ఎస్ పార్టీకి సేవలు అందించారు. ఇప్పుడు ఆయన బీఆర్ఎస్‌ను వీడి తెలంగాణ జాగృతిలో చేరడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గంభీరావుపేట మండలంలో అధిక జనాభా కలిగిన మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన కీలక నాయకుడిగా ఆయనకు మంచి పట్టుంది. బీసీ ముఖ్యంగా మున్నూరుకాపు వర్గానికి సరైన గుర్తింపు లభించడం లేదనే అసంతృప్తితోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# సీఎం సభ స్థలం పరిశీలన



బజార్ హత్నూర్ మార్చి 31 సిరి న్యూస్

ఏప్రిల్ మాసంలో బజార్ హత్నూర్ మండలం పిప్రి గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పర్యటన నేపథ్యంలో నిర్వహించనున్న సభా స్థలాన్ని ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ తో కలిసి మంగళవారం పరిశీలించారు. సభ విజయవంతంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై స్థానిక నాయకులతో చర్చించారు. సభా ప్రాంగణం, పార్కింగ్, ప్రజల సౌకర్యాలు తదితర అంశాలను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. వారి వెంట జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, ఇచ్చోడ మార్కెట్ చైర్మన్ కొమురం కోటేష్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు మల్యాల కరుణాకర్, లోలపు పోశెట్టి, లక్ష్మారెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకుడు ఏలేటి అశ్విన్ రెడ్డి, జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఆసిఫ్ ఖాన్, ఇచ్చోడ మండల అధ్యక్షుడు నారాయణ రెడ్డి, బద్దం పురుషోత్తం రెడ్డి, బజార్ హత్నూర్ మండల అధ్యక్షుడు జల్కె పాండురంగ, బోథ్ నియోజకవర్గ మైనారిటీ చైర్మన్ ముస్తఫా, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# రైలు ఢీకొని వృద్ధుని మృతి

తాండూర్ మార్చి 31 సిరి న్యూస్

మండల కేంద్రంలో శనివారం సంత సమీపంలో రైల్వే ట్రాక్‌పై మంగళవారం జరిగిన ప్రమాదంలో ఓ వృద్ధుడు దుర్మరణం చెందాడు. వివరాల్లోకి వెళితే.. చంద్రపల్లి గ్రామానికి చెందిన కంబాల బక్కయ్య(78) రైల్వే ట్రాక్ దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు బెల్లంపల్లి జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ కె.తిరుపతి తెలిపారు. రైలు ఢీకొనడంతో మృతదేహం తీవ్రంగా దెబ్బతిని రైల్వే ట్రాక్‌పై చిందరవందరగా పడిపోయిందని చెప్పారు. ఈ ఘటనపై బెల్లంపల్లి జీఆర్‌పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

# అభివృద్ధికి పెద్దపీట

- రూ.158 కోట్లతో ఆదిలాబాద్ మున్సిపల్ బడ్జెట్ ప్రతిపాదనలు
- జిల్లా కలెక్టర్ రాజర్షిషా



ఆదిలాబాద్ మార్చి 31 సిరి న్యూస్

ఆదిలాబాద్ పట్టణాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడానికి కట్టుబడి ఉన్నామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయంలో 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్ సమావేశాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూషతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆదాయ–వ్యయాలపై సుదీర్ఘంగా చర్చించి మొత్తం రూ.157.97 కోట్లతో (సుమారు రూ.158 కోట్లు) అంచనా బడ్జెట్ ప్రతిపాదనలను కౌన్సిల్ ఆమోదంతో సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పురోగతిలో బడ్జెట్ కీలకపాత్ర పోషిస్తుందని, గత ఆర్థిక సంవత్సరంలో సాధించిన లక్ష్యాలను సమీక్షించుకుంటూ కొత్త సంవత్సరానికి తగిన ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. మున్సిపాలిటీ ఆదాయ వనరులను పెంచడంతో పాటు అనవసర ఖర్చులను తగ్గించుకోవాలని అధికారులకు సూచించారు. పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, వీధిదీపాల నిర్వహణ వంటి మౌలిక సదుపాయాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అమృత్ పథకం కాలపరిమితిని మరో ఏడాది పొడిగించినట్లు, దీని ద్వారా పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, మంచినీటి పనులను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా కార్మికుల జీతాలు, వాహనాల నిర్వహణకు బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించినట్లు వివరించారు. అలాగే గ్రీన్ బడ్జెట్ కింద మున్సిపల్ చట్టం ప్రకారం 10 శాతం నిధులను పచ్చదనం పెంపు కోసం కేటాయించినట్లు తెలిపారు. ప్రభుత్వ గ్రాంట్లు, మున్సిపల్ సొంత ఆదాయం మధ్య సమతుల్యత పాటిస్తూ పారదర్శకమైన బడ్జెట్‌ను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ వార్డుల వారీగా వెనుకబడిన ప్రాంతాలు, విలీన గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించినట్లు తెలిపారు. కొత్తగా విలీనమైన ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, స్మశానవాటికల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. అలాగే ఆస్తి పన్ను, నల్లా పన్ను, ఖాళీ స్థలాల పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రాజు, వైస్ చైర్మన్ రోహిత్, వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినిలకు కంటి అద్దాల పంపిణీ

కామారెడ్డి మార్చి 31 సిరి న్యూస్



కామారెడ్డి జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ బాలికల కళాశాలలో విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో కళాశాలలో 325 మంది విద్యార్థినిలకు మంగళవారం కంటి పరీక్షలు నిర్వహించారు. నిపుణులైన వైద్య బృందం విద్యార్థినిల కంటి చూపును పరిశీలించి వివిధ కంటి సమస్యలను గుర్తించారు. ఈ పరీక్షల్లో కంటి సమస్యలు ఉన్న 36 మంది విద్యార్థినిలకు ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ అద్దాలు విద్యార్థినిల చదువులో స్పష్టతను పెంచి వారి విద్యా ప్రగతికి సహాయ పడతాయని వైద్యులు తెలిపారు. ఓ విద్యార్థినికి తీవ్రమైన కంటి సమస్య ఉన్నట్లు గుర్తించి మెరుగైన చికిత్స కోసం ఉన్నత స్థాయి కంటి వైద్య అధికారికి ప్రత్యేక ప్రతిపాదన పంపించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవీందర్ గౌడ్ మాట్లాడుతూ చిన్న వయస్సులోనే కంటి సమస్యలను గుర్తించి తగిన చికిత్స అందించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. పాఠశాల స్థాయిలో నిర్వహించే ఇలాంటి ఆరోగ్య శిబిరాలు విద్యార్థుల భవిష్యత్తును మెరుగుపర్చడంలో కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. జిల్లా ఉప వైద్యాధికారి రాంరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య సేవలను ప్రతి విద్యార్థి వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ జి.ప్రణీత మాట్లాడుతూ విద్యార్థినిల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న జిల్లా వైద్యశాఖకు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు తరచుగా నిర్వహిస్తే విద్యార్థుల్లో ఆరోగ్యంపై అవగాహన పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవీందర్ పటేల్, మెడికల్ అధికారి డాక్టర్ పి.సాధనతో పాటు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి మున్సిపాలిటీలో ఏసీబీ సోదాలు

సత్తుపల్లి మార్చి 31 సిరి న్యూస్



ఖమ్మం జిల్లా సత్తుపల్లి మున్సిపాలిటీలో అవినీతి ఆరోపణల నేపథ్యంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం ఆకస్మిక సోదాలు నిర్వహించారు. గత రెండేళ్లలో జరిగిన అవినీతిపై సత్తుపల్లి పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఆర్ఐ ఇంజనీరింగ్, అకౌంట్స్, పారిశుద్ధ్యం, బిల్ కలెక్టర్ తదితర విభాగాల్లో సుమారు 15 మంది ఏసీబీ అధికారులు పలు బృందాలుగా సోదాలు నిర్వహిస్తున్నారు. వివిధ విభాగాల్లో జరిగిన పనులు, ఖర్చులు, చెల్లింపులకు సంబంధించిన రికార్డులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. సోదాల సమయంలో మున్సిపాలిటీ సిబ్బందిని బయటికి రానివ్వకుండా వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని ఒక్కొక్కరిని విచారిస్తున్నట్లు తెలిసింది. మార్చి 31న ఆర్థిక సంవత్సరాంతం రోజునే ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఇదిలా ఉండగా మరో ఏసీబీ బృందం సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ కె.నరసింహ నివాసంలో కూడా సోదాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. మరికొద్ది గంటల్లో ఈ సోదాలకు సంబంధించిన పూర్తి వివరాలను ఏసీబీ అధికారులు వెల్లడించే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

# గంభీరావుపేటలో శుభ్రత కరవు





- 14వ వార్డులో ప్రజల ఆవేదన

గంభీరావుపేట మార్చి 31 సిరి న్యూస్

గంభీరావుపేట మండల కేంద్రంలోని 14వ వార్డులో శుభ్రత సమస్యలు తీవ్రంగా మారుతున్నాయి. వార్డులో చెత్త పేరుకుపోవడం, కాలువలు శుభ్రం చేయకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో కాలువల్లో నీరు నిల్వ ఉండడం దోమల పెరుగుదలకు కారణమవుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల వివరాల ప్రకారం.. చెత్తను తొలగించకపోవడం ద్వారా కాలువల్లో చెత్త పేరుకుపోయి దుర్వాసన వ్యాపిస్తోంది. దీంతో చిన్నపిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని చెబుతున్నారు. పలు మార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు సరైన చర్యలు తీసుకోలేదని విమర్శిస్తున్నారు. వెంటనే చెత్త తొలగింపు, కాలువల శుభ్రత, ఫాగింగ్ వంటి చర్యలు చేపట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి 14వ వార్డులో సమస్యను పరిష్కరించాలని, అలాగే సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# ఈదురు గాలులకు నేలరాలిన మామిడి పంట

- తీవ్రంగా నష్టపోయిన రైతులు


తాండూర్ మార్చి 31 సిరి న్యూస్

మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలో సోమవారం రాత్రి వీచిన ఈదురు గాలులతో కూడిన వర్షానికి మామిడి పంట తీవ్రంగా దెబ్బతింది. చేతికొచ్చిన పండ్లు చెట్ల నుంచి రాలిపోవడంతో మామిడి రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో కష్టపడి సాగు చేసిన పంట ఒక్కసారిగా నష్టపోవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. మండల వ్యాప్తంగా సుమారు 1,448 ఎకరాల్లో మామిడి పంట సాగులో ఉందని రైతులు తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా ప్రకృతి విపత్తుల కారణంగా మామిడి పంట నష్టపోతుండటంతో తాము ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మామిడి పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణ భరోసా కల్పించాలని, జరిగిన నష్టాన్ని సంబంధిత అధికారులు అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపి తగిన నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.



# ఆడవారి నుదిటిన 'బొట్టు' వెనక సైన్స్..!





**మన దేశం హిందూ సంస్కృతికి ప్రతీకకగా నిలుస్తది. మన పూర్వికులు ఏ ఆచారం పెట్టినా దాని వెనుక వైజ్ఞానిక అంశాలు దాగి ఉంటాయి. హిందూ నమ్మకాల ప్రకారం నుదుట బొట్టు పెట్టుకోవడం తప్పనిసరి. బొట్టు పెట్టుకోకుండా ఉండటం అశుభ ఫలితాలను ఇస్తుందని నమ్ముతారు. ఇది కేవలం నమ్మకాలకు సంబంధించిన విషయమేనా? .. అంటే కాదని చెప్పవచ్చు. దీనిలో కొంత సైన్స్ దాగి ఉందని ప్రముఖులు చెబుతున్నారు. అవేంటో తెలుసుకుందాం.**

జ్యోతిష్య శాస్త్రం ప్రకారం బొట్టును స్వచ్ఛతకు చిహ్నంగా భావిస్తారు. నుదిటిపై బొట్టు పెట్టుకోవడం వల్ల కనుబొమ్మల మధ్యలో ఉంటే అధిష్టాన దేవతకు శక్తి , రక్షణ లభిస్తాయని జ్యోతిష్య శాస్త్రం తెలుపుతుంది. ఇక సైంటిఫిక్ అధ్యయనాల ప్రకారం నుదిటిపై తిలకం పెట్టుకోవడం వల్ల పిట్యుటూరీ గ్రంథి ఉత్తేజితం అవుతుంది. కుంకుమలో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయట.. కాబట్టి దీన్ని నుదుటన పెట్టుకోవడం వల్ల మెదడు పనితీరు మెరుగ్గా ఉంటుందని, జ్ఞాపకశక్తి పెరుగుతుందని అంటారు.

మెదడు చురుగ్గా మారి సోమరితనం నశిస్తుందని, మానసిక ఒత్తిడి తగ్గి రిఫ్రెషింగా అనిపిస్తుందని తెలుపుతున్నారు. నుదిటిపై తిలకం ధరించినప్పుడు నాడీ మండల క్రియాశీలత ప్రారంభమయి నాడీ మండలాన్ని సక్రియం చేస్తుంది. ఫలితంగా నిద్రలేమి, సైనసైటిస్, మానసిక ఇబ్బందులు వంటి వివిధ వ్యాధుల నుంచి ఉపశమనం లభిస్తుంది. బొట్టు పెట్టుకునే ప్రాంతాన్ని రోజు మసాజ్ చేస్తే నరాలు సడలిస్తాయి. దీంతో శరీరం, మనసు రెండూ ప్రశాంతంగా ఉంటాయని చెబుతున్నారు.




# కుంకుడు కాయతో ఉపయోగాలివే..!



**కుంకుడు కాయ.. ఇది సహజంగా పకృతినుంచే లభిస్తుంది. దీన్ని పూర్వం మహిళలు తలస్నానం చేయడానికి ఉపయోగించేవారు. ఈరోజుల్లో షాంపులు వచ్చాక వాటిని ఉపయోగించేవారు తక్కువయ్యారు. ఈ కుంకుడు కాయలతో ఎన్నో ప్రయోజనాలున్నాయి. అవేమిటో తెలుసుకుందాం..**

కుంకుడుకాయలను వాడాలంటే కొంత శ్రమ కూడా ఉంటుంది. ఆ కాయలను చితక్కొట్టి, వాటిలో గింజలను తీసెయ్యాలి. వాటిని వేడి నీటిలో నానపెట్టి... ఆ రసంతో తలరుద్దుకునేవారు. ఇలా చేయడం ద్వారా సెపోనిన్ వలన నురుగ తయారై తలపైనున్న మలినాలు తొలగిపోయి, వెంట్రుకలు శుభ్రపడతాయి. కుంకుడుకాయ రసం నేచురల్ షాంపుగా పనిచేస్తుంది. కుంకుడు గింజల నుండి లభించే నూనె కీటక సంహారిణిగా పనిచేస్తుంది. పట్టు, సిల్క్ చీరలను శుభ్రపరచటానికి కుంకుడు రసం ఎంతో మేలైనది. నిజానికి తలంటుకి కుంకుడుకాయలను వాడటమే మంచిదని వైద్య నిపుణులు అంటున్నారు. దీని ద్వారా వెంట్రుకలు ఆరోగ్యంగా ఉండటమే కాకా పేలు, చుండ్రులాంటి సమస్యలు రావు. వేసవిలో కుంకుడుకాయలను బాగా ఎండబెట్టి పొడి చేసుకుని నిల్వ చేయొచ్చు. దీని వల్ల తలస్నానం చేసిన ప్రతీసారీ కుంకుడుకాయలను కొట్టుకునే శ్రమ తప్పుతుంది. ఎండబెట్టిన కమలాతొక్కలు, నిమ్మతొక్కలు, మందారాకులు, మందారపూలు, మెంతులను పొడిచేసి కుంకుడు పొడిలో కలపవచ్చు. వీటన్నిటినీ కలిపిన పొడితో తలస్నానం చేస్తే వెంట్రుకలు నల్లగా ఉంటాయి. త్వరగా నెరవవు. వీటిలో ఎటువంటి రసాయనికాలు కలువవు. కనుక జుట్టు నల్లగా నిగనిగలాడుతుంది. కుంకుళ్ళు తలస్నానానికి కాక, చర్మ సౌందర్యానికీ, మృదుత్వానికీ, చర్మ ఆరోగ్యానికీ తోడ్పడతాయి. కుంకుడురసంలో బంగారు ఆభరణాలను నానబెట్టి, మెత్తని బ్రష్‌తో మృదువుగా రుద్దితే... అవి శుభ్రపడి ధగధగా మెరుస్తుంటాయి.





# తలనొప్పికి ఉపశమనం.. ఇవే ఆయుర్వేద చిట్కాలు

## తలనొప్పుల్లో 200 పైగా రకాలు.. మీకు తెలుసా..?

తలనొప్పి.. ప్రతీ ఒక్కరిలో వచ్చే సాధారణ సమస్య. తలనొప్పుల్లో 200 పైగా రకాలున్నాయంటా. వాటిలో వచ్చే తల నొప్పి ఎలాంటిదనేది కచ్చితంగా అంచనా వేయడం కష్టమే. వీటిలో కొన్ని సాధారణ తలనొప్పులు, కొన్ని ప్రాణాంతకమైన తలనొప్పులూ ఉన్నాయి. ఈ బాధ నుంచి తప్పించుకోవడానికి చాలా మంది మందులు వేసుకుంటారు. అయితే ఇలా పేయిన్ కిల్లర్లు ఎక్కువగా తీసుకోవడం మంచిది కాదని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. అయితే తరచుగా తలనొప్పి వస్తున్నట్లు అయితే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి.

సాధారణంగా వచ్చే తలనొప్పుల నుంచి తక్షణ ఉపశమనం పొందాలంటే ఈ కింది చిట్కాలను పాటించండి.

వైద్య నిపుణులు చెప్పిన దానిప్రకారం... భోజనం టైంకి తినకపోయిన తలనొప్పి వచ్చే అవకాశం ఉంది. ఒకవేళ తలనొప్పి వేధిస్తుంటే..టైంకి తినే అలవాటు చేసుకోవాలి. కొందరికి స్వీట్స్ తింటే కూడా తలనొప్పి వస్తుంది. వీటిని గమనించి అవి తినడం మానేయాలి. ఒక గ్లాసు వేడి నీటిలో కొద్దిగా నిమ్మరసం కలుపుకొని తాగితే తలనొప్పి తగ్గే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. గోరువెచ్చని ఆవుపాలు సైతం తలనొప్పి నివారణిగా పనిచేస్తుందంటా. సరిగా కూర్చోకపోవటం, నిలబడకపోవటం వల్ల తల,మెడ,భుజాల వెనుక కండరాలు ఒత్తిడికి గురవుతాయి. దీని కారణంగానూ తలనొప్పి వస్తుంది. అదేపనిగా మెడ వంచి ఫోన్ చూసినా తలనొప్పి వస్తుంది. వీటిని గమనించి డైలీ రొటీన్‌లో సరిచేసుకోవాలి.

అలాగే.. తలనొప్పి సమస్య నుంచి బయటపడటానికి లవంగాలు సహాయపడతాయి. లవంగాలు నొప్పిని తగ్గించే లక్షణాలు ఉన్నాయి. తలనొప్పి నుంచి ఉపశమనం పొందడానికి.. కొన్ని లవంగాలను శుభ్రమైన గుడ్డలో కట్టి వాసన చూస్తూ ఉండాలి. ఇలా చేయడం వల్ల తలనొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. తలనొప్పిని తగ్గించడంలో అల్లం కూడా ఉపయోగపడుతుంది. క్రమం తప్పకుండా అల్లం రసం తాగడం వల్ల తలనొప్పి సమస్య నుంచి ఉపశమనం లభిస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. తలలో వాపులా తయారైన రక్తనాళాల వాపును తగ్గించడంలో అల్లం రసం ప్రధాన పాత్ర పోషిస్తుంది.



The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.